

అసెంబ్లీ వాయిస్



'టీడీఆర్ బాండ్ల' అవినీతిపై విచారించండి



తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రోడ్ల పేరిట గత వైసీపీ ప్రభుత్వం భారీగా అవినీతికి పాల్పడింది. దీనికి సంబంధించి టీడీఆర్ బాండ్ల జారీలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలి. తిరుమల బాలాజీ నగర్‌లో 1136 ఇళ్లుంటే ఇప్పటి వరకు 538 ఇళ్లకు మాత్రమే స్లాబ్ వేశారు. మిగిలిన వాటికీ స్లాబ్ వేసేందుకు చర్యలు తీసుకోవాలి. గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా శ్రీవారి దర్శన టికెట్లు అమ్ముకుని స్థానికులకున్న దర్శన వెసులుబాటును రద్దు చేశారు. మళ్లీ స్థానికులకు దర్శనాన్ని టీటీడీ పునరుద్ధరించడం హర్షణీయం. తిరుపతిని గంజాయిరహిత నగరంగా తీర్చిదిద్దుతామన్న హామీ పూర్తి స్థాయిలో అమలయ్యేలా చూడాలి.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి

దయనీయంగా ప్రభుత్వాస్పత్రి



వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి ఇక్కడి ఆస్పత్రిలోని ఉచిత డయాలసిస్ కేంద్రంలో సేవలను నిర్లక్ష్యం చేసింది. ఆస్పత్రి అభివృద్ధి పేరిట అప్పటి వైసీపీ నేతలు రూ.కోట్లలో దుర్వినియోగం చేసి కనీస వసతులు కూడా కల్పించలేదు. ప్రభుత్వాస్పత్రి నుంచి పేదలు మృతదేహాలను తరలించాలన్నా కనీసం రూ.10వేలు ఖర్చయ్యే పరిస్థితిని తీసుకొచ్చారు. నియోజకవర్గంలో ఆరు సంక్షేమ వసతి గృహాలు దుర్భరంగా ఉన్నాయి. ప్రభుత్వాస్పత్రితో పాటు సంక్షేమ వసతిగృహాలను బాగు చేసేందుకు ప్రభుత్వం సహకరించాలి.

- బొజ్జల సుధీర్‌రెడ్డి, శ్రీకాళహస్తి

కోసలనగరం.. పరిశ్రమలకు అనుకూలం



నగరి నియోజకవర్గంలోని కోసలనగరం పారిశ్రామిక రంగానికి ఎంతో అనుకూలం. పదేళ్ల కిందట ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ఏపీఐఐసీ 2500 ఎకరాలను సేకరించింది. ఇప్పటికీ ఒక్క పరిశ్రమనూ ఏర్పాటు చేయలేదు. చెన్నై విమానాశ్రయానికి, పోర్టుకు 60 కిలో మీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉంది. చెన్నై- బెంగళూరుకు ఎక్స్‌ప్రెస్ వే కూడా కోసలనగరం మీదుగా వెళుతోంది. ఇంత అనుకూలంగా ఉన్న ఇక్కడ పరిశ్రమల ఏర్పాటు చేస్తే రాష్ట్ర ఆర్థిక ప్రగతి తో పాటు ఈ ప్రాంతం అభివృద్ధికి దోహదపడుతుంది.

- గాలి భానుప్రకాష్, నగరి

- తిరుపతి/శ్రీకాళహస్తి/పుత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

నేడు జాతీయ మత్స్య దినోత్సవం



కరువు సీమలో జల సంపద

విభజన తర్వాత తిరుపతి జిల్లాకు అపారమైన మత్స్య సంపద కలిసి వచ్చింది. ఏకంగా 80 కిలోమీటర్ల పొడవైన సముద్రతీరం వరంగా వచ్చింది. 460 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంగల పులికాట్ సరస్సులో అత్యధికభాగం జిల్లాలో భాగం అయింది. గూడూరు ప్రాంతంలోని ఆక్వా కూడా మన ఖాతాలో చేరింది. దీంతో ఏడాదికి 80 వేల టన్నుల మత్స్యసంపద ఉత్పత్తి అవుతున్న జిల్లాగా తిరుపతి మారింది. దీని ద్వారా ఏటా రూ.700 కోట్లు ఆదాయం జిల్లాకు రావడం విశేషం.

కథనం తిరుపతి, ఆంధ్రజ్యోతి

- తిరుపతి జిల్లాలో మత్స్య సంపద ద్వారా ఏటా రూ. 700 కోట్ల ఆదాయం





రూ. 300 కోట్ల సముద్ర సంపద

2022 ఏప్రిల్‌లో తిరుపతి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడింది. అంతకు మునుపుదాకా ఉమ్మడి జిల్లాలో స్థానిక చెరువులు, ప్రాజెక్టులు తప్ప చెప్పుకోదగ్గ మత్స్యసంపద జిల్లాలో లేదు. ఈ మత్స్య సంపద స్థానిక అవసరాలకే సరిపోయేది. తిరుపతి జిల్లాలో నెల్లూరు జిల్లా నుంచీ 14 మండలాలు చేరడంతో జిల్లా స్వరూప స్వభావాలు సమూలంగా మారిపోయాయి. కోట, వాకాడు, చిల్లకూరు, సూళ్ళూరుపేట, తడ మండలాలు సముద్ర తీర ప్రాంతాన్ని కలిగి వున్నాయి. ఈ ప్రాంతంలో 70 వేల మత్స్యకార జనాభా వుండగా 12 వేల మందికి పైగా చేపలు పట్టడాన్ని ఉపాధిగా మార్చుకుని జీవిస్తున్నారు. దీంతో 80 కిలోమీటర్ల సముద్ర తీరం జిల్లాకు ఆదాయ వనరుగా మారింది. ఏటా సముద్రం నుంచీ 8744 టన్నుల మత్స్య సంపదను జిల్లా మత్స్యకారులు వెలికి తీస్తున్నారు. వీటిని వివిధ ప్రాంతాలకు తరలించి విక్రయించడం ద్వారా ఏటా రూ. 300 కోట్ల మేరకు ఆదాయం పొందుతున్నారు.

సముద్రంలో దొరుకుతున్నవి:
కానగత్తలు, కవళ్ళు, వంజరం, చందువ, తూర, తాటాకు, టేకు, సొర, మిల్క్, పండుగప్ప, టైగర్ రొయ్య, తెల్ల రొయ్య, పచ్చ పీతలు, చుక్కల చేపలు.



మన జాక్‌పాట్ పులికాట్



ఏపీ, తమిళనాడు రాష్ట్రాల పరిధిలో 461 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో విస్తరించిన పులికాట్ సరస్సు సింహ భాగం మన జిల్లాలోనే వుంది. తమిళనాడు పరిధిలో కేవలం 61 చదరపు కిలోమీటర్లు వుండగా ఏపీలో అంటే మన జిల్లాలో 400 కిలోమీటర్లు విస్తరించి వుంది. 168 రకాల చేపలు, రొయ్యలు ఇందులో లభిస్తాయి. పది వేల మంది మత్స్యకారులు సరస్సుపై ఆధార పడి బతుకుతున్నారు. వీటి విక్రయాల ద్వారా రూ. 60 కోట్ల దాకా జాలర్లు ఆదాయం గడిస్తున్నారు. గతేడాది పులికాట్ సరస్సు నుంచీ రొయ్యలు మాత్రమే 10,511 టన్నులు ఉత్పత్తి అయ్యాయి.

పులికాట్‌లో దొరికేవి:
మొయ్య, జెల్ల, ఫైలెట్, పీతలు, రొయ్యలు.



పూడిక తొలగిస్తే..

పులికాట్ సరస్సులో పూడిరాయి దొరువు వద్ద సముద్ర ముఖ ద్వారాలు పూడిపోయిన సంగతి తెలిసిందే. దశాబ్దాలుగా ప్రభుత్వం పూడిక తొలగింపు మీద దృష్టి పెట్టక పోవడంతో జిల్లా భారీ ఎత్తున మత్స్య సంపదను కోల్పోతోంది. తాజాగా కూటమి ప్రభుత్వం పూడిక తొలగింపు కోసం రూ. 97 కోట్లు విడుదల చేసింది. సంబంధిత పనులు త్వరగా పూర్తయితే సరస్సులో మత్స్య సంపద మరిన్ని రెట్లు ఎక్కువ ఉత్పత్తి అయ్యే అవకాశముంది.

పెంపకం చేపలు, రొయ్యలు ద్వారా రూ.400 కోట్లు





పెంచుతున్నవి: కట్లా, రోహు, మృగాల, కొరమీను, బంగారు తీగ, రూప్ చంద్, గండిచేప, తిలాపియా రకం చేపలు.



చేపలూ రొయ్యల పెంపకం కూడా జిల్లాకు భారీ ఆదాయం తెచ్చిపెడుతోంది. జిల్లాలో మొత్తం 560 చెరువులు, మూడు రిజర్వాయర్లలో 1.13 లక్షల ఎకరాల విస్తీర్ణంలో మంచి నీటి రకాల చేపలు ఉత్పత్తి అవుతున్నాయి. వంద ఎకరాల్లో చేపల చెరువులు, 9417 ఎకరాల్లో రొయ్యల చెరువులను ఆక్వా రైతులు సాగు చేస్తున్నారు. గతేడాది లెక్కలు పరిశీలిస్తే దేశీయ చేపల ఉత్పత్తి 60915 టన్నులు కాగా రొయ్యల ఉత్పత్తి 2713 టన్నులు. వీటి ద్వారా జిల్లాకు రూ. 400 కోట్ల ఆదాయం వచ్చింది.



మాడవీధుల్లో భక్తుల ప్రదక్షిణ పాట్లు

- గేట్లు మూసివేత నిర్ణయంతో అవస్థలు



గేట్లు మూసివేయడంతో నిరీక్షిస్తున్న భక్తులు

తిరుమల, నవంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల దక్షిణ మాడవీధుల్లోని గేట్లతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం మూస్తూ, తీస్తూ అగచాట్లకు గురిచేస్తున్నారు. సాధారణంగా శ్రీవారి దర్శనానికి వచ్చే వారు మాడవీధుల్లో ప్రదక్షిణ చేయడం ఆచారం. రద్దీరోజుల్లో దర్శనం చేసుకోలేకపోయిన భక్తులూ మాడవీధుల్లో ప్రదక్షిణ చేసి అఖిలాండం వద్ద కొబ్బరికాయ కొట్టి వెళ్లిపోతుంటారు. గత ప్రభుత్వంలోని అధికారుల నిర్ణయం నేటికీ కొనసాగుతున్న క్రమంలో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌ల్లోని కంపార్టుమెంట్లలో భక్తులు దక్షిణ మాడవీధిలోని ఇనుప బిడ్జి నుంచి ఆలయంలోకి వెళ్లి దర్శించుకుంటారు. గత ప్రభుత్వంలోని అధికారులు అధిక సంఖ్యలో భక్తులను ఆలయంలోకి అనుమతించాలనే పేరుతో వృద్ధులు, దివ్యాంగుల కోసం తిరుమల నంబి ఆలయం ముందుగా ఏర్పాటు చేసిన అదనపు క్యూలైన్‌లో నుంచే ఇతర భక్తులను తరచూ అనుమతిస్తున్నారు. ఈ క్రమంలో భక్తులు అటు, ఇటూ ప్రవేశించకుండా గేట్లు మూసివేస్తున్నారు. దీంతో ప్రదక్షిణ చేయాలనుకున్న భక్తులు గంటల తరబడి గేట్ల ముందే పడిగాపులు కాస్తున్నారు. కొందరు నిరీక్షించలేక తిరిగి వెళ్లిపోతున్నారు. బిడ్జిపై నుంచి భక్తులను ఆలయంలోకి అనుమతిస్తున్నప్పుడు ఈ అదనపు క్యూలైన్ ఏంటంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిశీలించి తమ ప్రదక్షిణకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ఐతేపల్లె @ ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ

చంద్రగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళలకు మరింత తోడ్పాటు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయి. ఇందులో భాగంగా మహిళా స్నేహపూర్వక పంచాయతీల (ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ) పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాయి. దీనికోసం జిల్లాకు ఒకటి చొప్పున రాష్ట్రంలో 26 పంచాయతీలను ఎంపిక చేశాయి. అందులో తిరుపతి జిల్లా నుంచి చంద్రగిరి మండలం 'ఐతేపల్లి' ఉంది. 1924 మంది జనాభా కలిగిన ఈ పంచాయతీకి సర్పంచిగా ఫాజిల్లా వ్యవహరిస్తుండగా, 10 మంది వార్డు సభ్యులూ మహిళలే ఉన్నారు. ఈ కార్యక్రమం కింద పంచాయతీలో మహిళల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేలా వారి భాగస్వామ్యంతో మౌలిక సదుపాయాలు సమకూరుస్తారు. విద్య, వైద్యం, స్వయం ఉపాధి వంటి పథకాల అమలుకు పెద్దపీట వేస్తారు. ఇళ్ల నుంచి విధిగా చెత్త సేకరణ, ఘనవ్యర్థాల నిర్వహణకు ప్రాముఖ్యం ఉంటుంది. బాల్య వివాహాలు, శిశుమరణాల నియంత్రణకు చర్యలు చేపడతారు. వ్యసనాలు లేని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతారు.

'అపార్'కు నోటరీ, అఫిడవిట్ అవసరం లేదు

- హెచ్‌ఎం/ఎంఈవోల లేఖ, ఎస్సెస్సీ సర్టిఫికెట్లతో జారీకి కలెక్టర్ ఆదేశం

తిరుపతివిద్య, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1-12 తరగతులు చదువుతున్న విద్యార్థుల అపార్ ఐడీకి జనన ధ్రువీకరణ పత్రం జారీ చేసేనిమిత్తం నోటరీ, అఫిడవిట్‌లు అవసరంలేకుండా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు డీఈవో కేవీఎస్ కుమార్ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల డిక్లరేషన్/హెచ్‌ఎం/ ఎంఈవోల లేఖ, ఎస్ఎస్‌సీ మార్కుల జాబితా మేరకు కొత్త ఆధార్‌ఐడీ నమోదు, ఆధార్ కార్డులలో తేడాలను సకాలంలో సరిచేసి అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఒకటినుంచి తొమ్మిది తరగతులు చదివే విద్యార్థులకు ఆధార్‌లో పేరు సవరించేందుకు ఆయా హెచ్‌ఎంలు, ప్రైవేట్ పాఠశాలల్లో అయితే తనిఖీ అధికారి నుంచితెచ్చిన డిక్లరేషన్‌తో సరిచేయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ఆధార్‌లో పుట్టినతేదీ సవరణకు వీఆర్వో లేదా వైద్యశాఖ లేదా మున్సిపల్ అధికారులు జారీచేసిన జననధ్రువీకరణపత్రం ఆధారంగా, ఇంటర్ విద్యార్థులకు పదో తరగతి సర్టిఫికెట్ ఆధారంగా సవరించేలా కలెక్టర్ చర్యలు చేపట్టారని వివరించారు. జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సచివాలయ సెక్రటరీలు, వీఆర్వోలు పైఆదేశాలను పాటించి విద్యార్థులపై ఒత్తిడిలేకుండా చూడాలని ఒక ప్రకటనలో కోరారు.

మున్సిపాలిటీలో కొనసాగుతున్న విచారణ

- మరో రెండు రోజుల్లో పూర్తి

తిరుపతి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పాలకసంస్థలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వ అధికారుల అక్రమాలపై జరుగుతున్న విచారణ మూడు రోజుల విరామం అనంతరం బుధవారం తిరిగి ప్రారంభమైంది. గత వారం మూడు రోజుల పాటు అనంతపురం రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలో మూడు బృందాలు తిరుపతిలో విచారణ చేపట్టాయి. ఆతర్వాత మళ్లీ తిరుపతికి చేరుకున్న విచారణ బృందం తమ పని చేసుకుపోతోంది. ఇటీవల బదిలీఅయిన రెవెన్యూ అధికారి కేఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబు, డీఈ విజయకుమార్ రెడ్డిపై అక్రమ ఆరోపణలపై లోతుగా విచారణ చేస్తున్నట్టు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో పుంగనూరు మున్సిపల్ కమిషనర్‌గా కూడా పనిచేసిన వర్మ అవకతవకలపై ప్రత్యేక దృష్టిపెట్టినట్టు సమాచారం. ఇప్పటికే విచారణకమిటీ బృందంపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నట్టు తెలిసింది. అయితే ఆర్డీ విశ్వనాథ్ ముక్కుసూటిగా వ్యవహరిస్తారన్న పేరుండడంతో విచారణ ఎదుర్కొంటున్న వారి ఎత్తులు పారడంలేదన్న ప్రచారం జరుగుతోంది. మరో రెండు రోజుల్లో విచారణ పూర్తికానుందని, నివేదికను డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు అందజేయనున్నట్టు సమాచారం.

మరింత పటిష్ఠంగా సోషల్ మీడియా సెల్

- అనుచిత పోస్టులు, అసభ్యకర వ్యాఖ్యలపై నిఘా

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైం సెల్‌కు అనుబంధంగా ఉన్న సోషల్ మీడియా సెల్‌ను మరింత పటిష్ఠ పరచడానికి పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో 16 కేసులు నమోదైనట్లు అధికారులు చెప్పారు. ఇన్‌స్టా, వాట్సాప్, ఎక్స్ మాధ్యమాల్లో అసభ్యకర మెసేజీలు పోస్టు చేస్తున్న వారికి 41ఏ నోటీసులు అందించడం.. మరోవైపు కేసులు నమోదు చేస్తున్నారు. అయినా కొందరు అటు అధికారులు.. ఇటు ప్రభుత్వ అధినేతలను టార్గెట్‌గా చేసుకుని ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట నుంచి వాట్సాప్‌లు, ఇన్‌స్టా ద్వారా అసభ్యకర పోస్టులు పెడుతూనే ఉన్నారు. దీన్ని గుర్తించిన అధికారులు సోషల్ మీడియా సెల్‌కు అవసరమైన బాధ్యతలు, అధికారాలు కట్టబెట్టాలని ఆలోచిస్తున్నారు. కాగా, సోషల్ మీడియాలో పేరు ఒకరిది.. అకౌంటు మరొకరు హ్యాండిల్ చేస్తుండటం ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. నచ్చని పార్టీ నాయకుడిపై అసభ్యకరంగా పోస్టింగ్ లేదా మార్ఫింగ్ చేసిన ఫొటోలను అప్‌లోడ్ చేయడం వంటి వ్యవహారాలన్నీ చేస్తున్న హ్యాండిలర్స్ ఎక్కువగా యువకులే ఉన్నట్లు తెలిసింది. అటువంటి వారిపైనా పోలీసులు దృష్టి సారించారు. ప్రధానంగా కొంతమంది విద్యావంతులు.. మరికొందరు మధ్యలో ఆగిపోయి సులభంగా డబ్బు సంపాదనకు ఆశపడి ఇలాంటి అసభ్యకర పోస్టులు పెట్టి డబ్బులు ఆర్జిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా ప్రత్యేకంగా గ్రూపులు ఏర్పాటుచేస్తూ అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిని ఒకదారికి తీసుకురావడానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. సైబర్ క్రైం సెల్‌కు అనుబంధంగా ఉన్న సీఐ విక్రమ్‌ను ఇన్‌చార్జిగా నియమించిన విషయం విదితమే. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగులు పెడుతున్న వారిలో 16 మందిపై కేసులు నమోదు చేసిన పోలీసులు.. మిగతా వారిపైనా దృష్టి సారించినట్లు సమాచారం.



ఇసుక యార్డులకు లాటరీ తీస్తున్న కలెక్టర్

ఏజెన్సీలకు మూడు ఇసుక యార్డులు

- లాటరీ పద్ధతి ద్వారా అప్పగింత

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు ఇసుక యార్డులను లాటరీ పద్ధతి ద్వారా మూడు ఏజెన్సీలకు అప్పగించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో జేసీ శుభంబన్సల్‌తో కలిసి ఆయన ఇసుక స్టాక్‌యార్డుకు సంబంధించిన లాటరీ నిర్వహించారు. అవిలాలకి సంబంధించిన లీలాఎంటర్‌ప్రైజెస్‌కి, కాటన్‌మిల్‌కు సంబంధించి పి.శ్రీనివాసులురెడ్డి, గాజులమండ్యం స్టాకు యార్డుకు సంబంధించి తిష్య కన్‌స్ట్రక్షన్స్‌కే శ్రీనివాసులకు లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఐదు రోజుల్లోగా ఇసుకను అందుబాటులో తేవాలని, ప్రజలందరికీ ఇసుక స్టాక్ యార్డుల గురించి అవగాహన కల్పించాలన్నారు. కాగా, అన్నమయ్య జిల్లా టుంగుటూరు గ్రామం నందలూరు నుంచి ఇసుకను తెప్పించుకుని కాటన్ మిల్లు వద్ద ఉంచుతారు. ఇక్కడ టన్ను రూ.640 అందుబాటులో ఉంచుతున్నారు. రేణిగుంట మండలం గాజులమండ్యం దగ్గర టన్ను రూ.675, తిరుపతి రూరల్ మండలం అవిలాల వద్ద ఇసుక టన్ను రూ.645గా నిర్ధారించారు. నిర్ణయించిన ధరలకంటే ఒక రూపాయి ఎక్కువ తీసుకున్నా డీలర్‌షిప్ రద్దు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గనుల భూగర్భశాఖ అధికారి బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై సీతారామలక్ష్మణ సమేత హనుమంతుడి దర్శనం



చంద్రగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై సీతారామలక్ష్మణ సమేత హనుమంతు ఉత్సవర్లు భక్తులకు దర్శనమిచ్చారు. పునర్వసు నక్షత్రం సందర్భంగా ఉత్సవర్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం సీతారామలక్ష్మణ సమేత సమేత హనుమ ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చిపై అధిష్ఠించారు. స్వామి అమ్మవార్లు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, జమేధర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. కోదండరామాలయంలో ఆగమ శాస్త్రోక్తంగా ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు.

ఘనంగా ముగిసిన రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు

చంద్రగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తొండవాడ అగస్త్యేశ్వరాలయంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, ఆనందవల్లిదేవికి అభిషేకం నిర్వహించారు. స్వామివారి త్రిశూలానికి వివిధ రకాల అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రిశూలాన్ని ఆలయ ప్రదక్షిణగా ఊరేగించారు. స్వర్ణముఖి నదిలో శివనామ స్మరణల నడుమ త్రిశూల స్నానం చేపట్టారు. భక్తులు కూడా స్నానమాచరించారు.



త్రిశూల స్నానం

ధ్వజావరోహణతో ఉత్సవాలు ముగిశాయి. ధర్మకర్త రఘునాథరెడ్డి,భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి: డీఈవో



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కేవీఎస్ కుమార్

రామచంద్రాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డీఈవో కేవీఎస్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మెడ్ ప్రాంతీయ శిక్షణాకేంద్రంలో ఉపాధ్యాయులకు స్కూల్ లీడర్‌షిప్‌పై అందిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాలకు చెందిన 200మంది ఉపాధ్యాయులకు ఆరు రోజుల పాటు రెసిడెన్సియల్ శిక్షణ అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలన్నారు.. కార్యక్రమంలో ఏఎంవో శివ శంకరయ్య, ఏఏఎంవో మధు, చంద్రగిరి ఎంఈవో భాస్కర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల హామీలు అమలు చేయాలి



డైరీ ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

పాకాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండు చేశారు. స్థానిక ఎస్వీఎస్ పాఠశాలలో బుధవారం సంఘం సమావేశం జరిగింది. మండల శాఖ అధ్యక్షుడు ఎం.ప్రభు మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. సంఘం డైరీని ఆవిష్కరించారు. జి.సుధాకర్,చంద్రశేఖర్,శ్రీరాములు, అప్పాజి, యువరాజ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

నేడు కేంద్ర క్రీడల శాఖ మంత్రి రాక

తిరుపతి(క్రీడలు), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ గురువారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తిరుచానూరు ఆలయం చేరుకుని, పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారు. సాయంత్రం తిరుమల చేరుకుని బస చేస్తారు. శుక్రవారం శ్రీవారి సేవలో పాల్గొని తిరుగు ప్రయాణమవుతారు.

అనుమతి రాక..ప్రయాణం సాగక ..

● పుష్కరకాలమైనా పూర్తికాని బావిరాగన్న చెరువు రోడ్డు



చంద్రగిరి మల్లేశ్వరాలయం వద్ద దుస్థితి

పాకాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ అనుమతి రాక.. ప్రారంభించిన రోడ్డు పనులు పూర్తికాక బావిరాగన్నచెరువు గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దగోర్పాడు పంచాయతీ పరిధిలోని ఈ గ్రామానికి పాకాల నుంచి సరైన రోడ్డు సౌకర్యం లేదు. గ్రామస్థుల విజ్ఞప్తితో గతంలో నాటి మంత్రి గల్లా అరుణకుమారి నాబార్డు కింద రూ.2.8కోట్లు మంజూరు చేయించారు. 2012 జనవరిలో పనులకు శంకుస్థాపన చేశారు. దామలచెరువు నేంద్రగుంట రోడ్డు నుంచి పాకాల - గానుగపెంట రోడ్డు వరకు బావిరాగన్నచెరువు మీదుగా 4.6 కిలోమీటర్ల బీటి రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. అటూ ఇటూ సుమారు మూడున్నర కిలోమీటర్ల మేర రోడ్డు పనులు బాగానే జరిగాయి. ఫారెస్ట్ అధికారులు అభ్యంతరంతో పాకాల నుంచి బావిరాగన్న చెరువుకు రోడ్డు కిలోమీటరు రోడ్డు వేయకుండా ఆపేశారు. అప్పటి నుంచి రాళ్లు తేలి రోడ్డు అధ్వానంగా తయారయింది. పాకాల నుంచి 2 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే ఈ మార్గంలో బావిరాగన్న చెరువు చేరుకునే గ్రామస్తులు పెదగోర్పాడు, కొత్తపల్లె దాటి గానుగపెంట రోడ్డు నుంచి తమ గ్రామానికి ఆరు కిలోమీటర్లకు పైగా చుట్టుకొని వెళ్లాల్సి వస్తోంది. అప్పట్లో నరహంతకుడు గుండ్లగోపాల్ సంచారంతో ఇక్కడి బీసీ, ఎస్సీ కాలనీలలోని పలువురు పాకాల సమీపంలోని శ్రీనివాసపురం చేరుకుని స్థిరపడ్డారు. వీరంతా తమ భూములకు వెళ్లాలన్నా, పశువులను మేతకు తీసుకువెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. 12 ఏళ్ల క్రితం మంజూరైన నాబార్డు నిధులు మురిగిపోయి ఉంటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుంతలదారులతో ప్రజల అవస్థలు

చంద్రగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో నిత్యం వాహనాలు రద్దీగా తిరిగే దారులు గుంతల మయమయ్యాయి. ప్రధానంగా చంద్రగిరి నుంచి శ్రీనివాసమంగాపురం మార్గంలో మల్లేశ్వరాలయంలో మూడు నెలల క్రితం సీసీ రోడ్డు వేశారు. రోడ్డు ఎత్తుగా వేసి బీటీ రోడ్డుకు ట్యాంపర్ చేయకుండా వదిలేయడంతో అక్కడ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు తాత్కాలికంగా కంకర, వేస్ట్, పోసి వదిలేశారు. ఇటీవల వర్షాలకు కంకర పూర్తిగా తేలిపోయింది. దీంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. శ్రీనివాసమంగాపురం జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్ద లోతైన గుంత ఏర్పడింది. వర్షాలకు అందులో నీరు చేరింది. దీంతో గుంతలోతు తెలియక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీవారిమెట్టు మార్గంలో శ్రీవారి దర్శనానికి, పీలేరు, మదనపల్లెకు నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



శ్రీనివాసమంగాపురం సమీపంలో ఫ్లైఓవర్ వద్ద గుంత



రాళ్లు తేలిన ఈ రోడ్డు మీద నడిచేదెలా..

పుట్టిన రోజు వేడుకలకు ఎమ్మెల్యే నాని దూరం

చంద్రగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతి నేపథ్యంలో గురువారం రోజున తన పుట్టిన రోజు వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకొన్నట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. తన పుట్టిన రోజు వేడుకలు చేయరాదని చంద్రగిరి, చిత్తూరు నియోజకవర్గాల టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఆయన కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే ఒక ప్రకటన విడుదల చేశారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాజీ ఎంపీ కేశినేని నాని, ప్రముఖ సినీ నటి ప్రభ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు.

మంత్రులను కలిసిన రుద్రకోటి



బీసీ శాఖ మంత్రి సవితను సన్మానిస్తున్న సదాశివం

తిరుపతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమాభివృద్ధి ఛైర్మన్‌గా నియమితులైన రుద్రకోటి సదాశివం బుధవారం విజయవాడలో రాష్ట్ర బీసీ, జౌళి శాఖామంత్రి ఎస్.సవిత, గనులు, ఎక్సైజ్ శాఖ రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రలను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలకవీటి విజయ్ కుమార్, విజయవాడ సెంట్రల్ నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాజీ మార్గంలో కేసుల పరిష్కారంపై అవగాహన

జూనియర్ సివిల్ జడ్జి



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణిమదేవి

పాకాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్‌లో కక్షిదారులు రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకునేలా పోలీసు అధికారులు, న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని జూనియర్ సివిల్ జడ్జి పి.పూర్ణిమదేవి కోరారు. బుధవారం స్థానిక కోర్టులో జడ్జి అధ్యక్షతన పోలీసుల అధికారులతో లోక్ అదాలత్‌పై సమావేశం నిర్వహించారు. డిసెంబరు 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో పాకాల సీఐ మద్దయ్య ఆచారి, కల్లూరు ఎక్సైజ్ సీఐ మాదవన్ స్వామి, కల్లూరు ఎస్సై వెంకటేశ్వరులు, చంద్రగిరి ఎక్సైజ్ ఎసై గిరి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అమరా ఆస్పత్రిలో అత్యాధునిక రక్తనిల్వ కేంద్రం

● ప్రారంభించిన ఎండీ డాక్టర్ రమాదేవి



రక్తదానం చేస్తున్న డాక్టర్ రమాదేవి

రేణిగుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని అమరా ఆస్పత్రిలో అత్యాధునిక రక్త నిల్వ కేంద్రాన్ని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడి ఉద్యోగులతో కలిసి రక్తదానం చేశారు. ఆమె మాట్లాడుతూ కొత్త బ్లడ్ బ్యాంక్‌లో అధునాతన సాంకేతికత, రక్తసేకరణ, పరీక్ష, ప్రాసెసింగ్, నిల్వ వసతులున్నాయన్నారు. హోల్ బ్లడ్, ప్యాక్డ్ సెల్స్, సెలైన్ వాష్ ఆర్బీసీ, ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా, క్రియో ప్రిసిపిటేట్, ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా, ప్లేట్‌లెట్ కాన్సన్‌ట్రేషన్, సింగిల్ వంటివి డోనర్ ప్లేట్లెట్స్, సింగిల్ ప్లాస్మా అందుబాటులో ఉంటాయన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకే కాకుండా ఇతరులకూ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ గౌరినేని, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితులను శిక్షించాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖలో న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని లా స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు కళాశాల ఎదుట బుధవారం అసోసియేషన్ నేతలు నిరసన తెలిపారు. లా స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు సుందర్రాజు మాట్లాడుతూ విశాఖ పట్నంలోని ఓ ప్రైవేట్ లా కాలేజీలో చదువుకుంటున్న విద్యార్థినిపై తోటి విద్యార్థులు సామూహిక అత్యాచారం చేయడం దారుణమన్నారు.

గ్రంథాలయ పోటీల విజేతలకు బహుమతులు



పాకాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దామలచెరువు శాఖా గ్రంథాలయ వారోత్సవాల్లో బాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు బుధవారం బహుమతులు అందజేశారు. గ్రంథాలయ సహాయకుడు మురళీ బాబు, హెచ్ఎంలు మాధవీ, పార్థసారథి పాల్గొన్నారు.

రిటైర్డు ప్రొఫెసర్ కృష్ణయ్యను తొలగించండి



వీసీ, రిజిస్ట్రార్లకు విన్నవిస్తున్న ఆర్కే నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో లా గౌరవ డైరెక్టర్‌గా నియమితులై అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న రిటైర్డు ప్రొఫెసర్ వీఆర్సీ కృష్ణయ్యను పదవి నుంచి తప్పించాలని వీసీ, రిజిస్ట్రార్లకు టీఎన్ఎస్ఎఫ్ నేతలు విన్నవించారు. ఈ మేరకు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడును టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్కే నాయుడు కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆర్కే నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల లా కోర్సుకు గౌరవ డైరెక్టర్‌గా కృష్ణయ్యను నియమించారని తెలిపారు. ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయన్నారు. రిటైర్డు ప్రొఫెసర్లకు యూనివర్సిటీలో పదవులు ఇవ్వకూడదని కూటమి ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేసిందని గుర్తుచేశారు. అయినా కృష్ణయ్య కొనసాగడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు శ్రీరాం, బషీర్, రాజా, గంగాధర్, రామాంజనేయులు, గణేష్ పాల్గొన్నారు.

అద్దెకిస్తే కబ్జా చేస్తున్నారు

బాధితునికి న్యాయం చేయాలి : సీపీఐ

తిరుపతి(ఆటోనగర్)నవంబరు20(ఆంధ్రజ్యోతి): స్థలాన్ని అద్దెకు ఇస్తే, కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారంటూ డి.రాజేశ్వరరావు బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వాపోయారు. ముత్యాలరెడ్డిపల్లి గాంధీపురం సమీపంలోని సర్వేనెంబరు 15లోని 144 అంకణాల యశోద,ఆమె అనుచరులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 2006 నుంచి తమ ఆధీనంలోని ఆ స్థలంలో తాము నిర్మించుకున్న గదులను అద్దెకు ఇచ్చామని తెలిపారు. ఆమె పిల్లల కోసం ఆరు లక్షల రూపాయలు అప్పుగా కూడా ఇచ్చామన్నారు. అందుకు యశోద రెండు లక్షలు చొప్పున మూడు బ్యాంక్ చెక్కులు కూడా ఇచ్చారన్నారు. తాము విదేశాలకు వెళ్ళి వచ్చేలోపు ఈ స్థలం మాదేనని అడ్డు తిరగడమే కాకుండా అద్దె కూడా చెల్లించడంలేదని ఆయన వాపోయారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. కాగా బాధితుడైన రాజేశ్వరరావుకు మద్దతు పలికిన తమ పట్లకూడా యశోద అసభ్యకరంగా మాట్లాడుతోందని సీపీఐ నాయకుడు సి.పెంచలయ్య ఆరోపించారు. అధికారులు స్పందించి బాధితునికి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

న్యాయవిద్యతో గౌరవం.. గుర్తింపు: ఎస్వీయూ వీసీ



బహుమతులు అందిస్తున్న వీసీ అప్పారావు, రిటైర్డ్ జడ్జి గుర్రప్పనాయుడు

తిరుపతిరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో న్యాయవిద్య కీలక భూమిక పోషిస్తోందని, ఈ కోర్సు చదివిన వారికి ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభిస్తాయని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు తెలిపారు. రేణిగుంట రోడ్డులోని అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ న్యాయవిద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ (ఏఐ) స్పేస్‌లా, ఎన్విరాన్‌మెంట్‌లాకు ఎంతో ప్రాధాన్యత ఉందని, వీటిపై విద్యార్థులు పట్టు సాధించాలని తెలిపారు. రిటైర్డ్ జిల్లా జడ్జి గుర్రప్పనాయుడు లా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి మాట్లాడారు. కాగా మూట్‌కోర్ట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బిజయకుమార్ బెహరా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.అమృత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువ పోరంబోకు భూమి ఆక్రమణయత్నం

తిరుపతిరూరల్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): పద్మావతి వర్సిటీ నుంచి తుమ్మలగుంట వెళ్లే మార్గంలోని బూరగమాను వద్ద సర్వేనంబరు 2/9లోని ఖరీదైన ప్రభుత్వ కాలువపోరంబోకు భూమిని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నించారు. ఎక్సవేటర్‌తో చదును చేసి నిర్మాణానికి సిద్ధమవుతున్నారు. దీనికి ఆనుకుని కొందరి రైతులకు వ్యవసాయ భూమి ఉంది. ఈకాలువ పై ఇరువర్గాలు కొన్నిరోజులుగా గొడవలు పడుతున్నారని తెలిసింది. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఈభూమికి సమీపంలో చేపట్టిన అపార్ట్‌మెంట్ నిర్మాణాల్లో కూడా కొంతకాలువభూమి కలసి ఉందంటున్నారు. వీఆర్వో రమేష్‌ని వివరణ కోరగా ప్రభుత్వభూమిలో నిర్మాణం జరగకుండా నిలిపివేశామన్నారు. సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. హెచ్చరికబోర్డుని ఏర్పాటు చేస్తామన్నారు.



ప్రభుత్వభూమిని ఎక్సవేటర్‌తో చదును చేశారిలా..

భవన నిర్మాణంపై స్థానికుల ఆగ్రహం



అధికారులను నిలదీస్తున్న స్థానికులు

చంద్రగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీటీడీ అనుబంధంగా ఉన్న కోదండరామాలయం ముందు కసాయిమార్కెట్ వీధిలో అనుమతులు లేకుండా చేపడుతున్న ఐదందస్తుల భవన నిర్మాణంపై గ్రామస్తులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ప్రార్థనా మందిరం లేక మదర్సా నిర్మిస్తున్నారా అని అధికారులను స్థానికులు ప్రశ్నించారు. ఈ వీధిలో ముస్లీంలకు సంబంధించిన 15 ఇళ్ళు ఉన్నాయన్నారు. ఇప్పటికే మసీదు కూడా ఉందన్నారు. వీర్లచావడి స్థలంలో నిబంధనల మేరకు మాత్రమే ప్రార్థనా మందిరం, మదర్సాలు నిర్మించాన్నారు. అక్రమ కట్టడాలను నిలిపివేయాలని అధికారులను కోరారు. పొదిరి ధనంజయరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, హేమచంద్రారెడ్డి పాల్గొన్నారు.

నైపుణ్యంతో ఉన్నత అవకాశాలు



కార్యక్రమంలో వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత ఉద్యోగావకాశాలు లభిస్తాయని పద్మావతి మహిళా యూనివర్శిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ పేర్కొన్నారు. లైఫ్ స్కిల్స్‌పై బుధవారం వర్సిటీలో నిర్వహించిన ఇండక్షన్ ప్రోగ్రాంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. నిర్ణయాలు తీసుకోవడం, సృజనాత్మకత, క్లిష్ట సమస్యలను అధిగమించడం నేర్చుకుంటే జీవితంలో ఏమైనా సాధించగలమని అభిప్రాయపడ్డారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు, పలు అంశాలపై నిపుణుల చేత ప్రసంగాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. రిజిస్ట్రార్ రజని పాల్గొన్నారు.

పుస్తకాలు దారి దీపాలు



సభలో ప్రసంగిస్తున్న గంగాధర ప్రసాద్, చిత్రంలో ప్రిన్సిపాల్ నారాయణమ్మ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు మనిషికి జీవిత గమనాన్ని నిర్దేశించే దారి దీపాలని సాహిత్యవేత్త డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్ పేర్కొన్నారు. పద్మావతి డిగ్రీ-పీజీ కాలేజీలో బుధవారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మానవ నాగరికత ఆరంభమైనప్పటి నుంచే జ్ఞానాన్ని తెలుసుకోవడమనే లక్ష్యం ఉందన్నారు. ఈ క్రమంలో గ్రంథాలు, గ్రంథాలయాలు రూపుదిద్దుకున్నాయని చెప్పారు. పుస్తక పఠనాన్ని ఈ తరం విధిగా ఏర్పరుచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాల్లో ఎక్కువ కాలం గడపడం ద్వారా జీవితంలో ఉన్నత దశకు చేరుతారన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాళంగి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు లోడ్ ట్రాక్టర్లు, మూడు ఖాళీ ట్రాక్టర్లను సీఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ కాళంగి నదిలో అధికారికంగా ఇసుక రీచ్ లేదన్నారు. నది నుంచి ఇసుకను ఇతర మండలాలకు తరలించకూడదని, మండలంలోని ప్రజల అవసరాలకు మాత్రమే వాడుకోవాలన్నారు. కొందరు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ విశ్వనాథ నాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ అలిపిరి, ఇస్కాన్ పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్లు, లైన్ల మరమ్మతులు, కొమ్మలు తొలగింపు చేపడుతున్న నేపథ్యంలో గురువారం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఈఈ వి.చంద్రశేఖరరావు బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. శాంతినగర్, రామచంద్రనగర్, తిరుమల బైపాస్ రోడ్డు సమీప ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహాలనోబిస్ ఇంటర్నేషనల్ అవార్డుకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్టాటిస్టిక్స్ ప్రొఫెసర్ పి.సి.మహాలనోబిస్ ఇంటర్నేషనల్ 2025 సంవత్సర అవార్డు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో కె.మోహన్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవార్డుతో పాటు రూ.10వేలు నగదు బహుమతి, సర్టిఫికెట్‌ను నెదర్లాండ్ ఇంటర్నేషనల్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ అందజేయనున్నట్లు తెలిపారు. గణాంకవేత్త, సిద్ధాంతం, అభ్యాసంలో ప్రావీణ్యం కలిగినవారు ఈ అవార్డుకు అర్హులు. ఆసక్తిగలవారు ఆన్‌లైన్‌లో డిసెంబరు 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 0877-2286921ను సంప్రదించాలని కోరారు.

24న జాతీయ కవి సమ్మేళనం

తిరుపతి (లీలామహల్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భారతీయ రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో పదకవితా పితామహుడు అన్నమయ్యపై తిరుపతిలో ఈ నెల 24వ తేదీన జాతీయ కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు సమాఖ్య తిరుపతి జిల్లా అధ్యక్షుడు పాలకూరు కన్నయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూత్ హాస్టల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమంలో చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన సాహితీవేత్తలు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

సంస్కృతిని ప్రతిబింబించే రాసాని సాహిత్యం

నవలల ఆవిష్కరణ సభలో ఎస్వీయూ రిజిస్ట్రార్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాసాని సాహిత్యం సంస్కృతిని ప్రతిబింబిస్తోందని ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు పేర్కొన్నారు. ఎస్వీయూ సెనేట్ హాల్లో రచయిత రాసాని రాసిన కపిరి, రక్తచందనం నవలల ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ అధ్యక్షతన చేపట్టిన సభలో రిజిస్ట్రార్ భూపతి నాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మానవ జీవితాన్ని నిశితంగా పరిశీలించి రాసాని రచనలు చేయడం గొప్ప విషయమన్నారు. మనుషుల్లో మానవీయ విలువలను పెంచడానికి రచయితలు, కళాకారులు దోహదం చేయాలని సూచించారు. తెలుగు విశ్రాంతాచార్యులు మేడిపల్లి రవికుమార్ 'కపిరి' నవలను, పద్మావతి వర్సిటీ తెలుగు అధ్యాపకులు డాక్టర్ దొమ్మరాజు యువశ్రీ 'రక్త చందనం' నవలను సమీక్షించారు. సాహిత్యవేత్త కొత్వాలు అమరేంద్ర, సాహిత్య ప్రముఖులు సాకం నాగరాజు, గార్లపాటి దామోదరనాయుడు, షణ్ముగం, కృష్ణస్వామిరాజు, మౌని, పెమ్మరాజు గోపాలకృష్ణ, ఏనుగు అంకమ నాయుడు, వివిధ విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

సమర్థంగా చెత్త నిర్వహణ

తిరుపతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఉత్పత్తయ్యే చెత్త నిర్వహణ కోసం తూకివాకం వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. తూకివాకం వద్ద ఉన్న తడి, పొడి చెత్త నిర్వహణ, హోటల్స్ వేస్ట్‌తో గ్యాస్ తయారీ కేంద్రం, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ కేంద్రాల నిర్వహణపై బుధవారం సంబంధిత అధికారులతో ఆమె సమావేశమయ్యారు. అన్ని ప్లాంట్లు వంద శాతం నిర్వహణలో ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. నగరంలో భవన నిర్మాణ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ మాహాపాత్ర తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



మహేష్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ సివిల్ ఇంజినీ రింగ్ పరిశోధకులు ఎం.మహేష్ డాక్టరేట్ పొందారు. ఎక్స్‌పెర్మెంటల్ ఇన్వెస్టిగేషన్ ఆన్ ఎఫెక్ట్స్ ఆఫ్ డెలిటేరియస్ మెటీరియల్స్ ప్రెజెంట్ ఇన్ ఫైన్ అగ్రిగేట్ ఆన్ ప్రాపర్టీస్ ఆఫ్ జియో పాలిమర్ కాంక్రీట్ అంశంపై ప్రొఫెసర్ మధుసూదనరెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ప్రస్తుతం ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం నుంచి ఉత్తమ అధ్యాపక అవార్డును స్వీకరించారరని సీఈః దావ్లానాయక్ గుర్తు చేశారు.

వెటర్నరీ యూనివర్సిటీలో..
ఉద్యోగ సంఘ ఎన్నికల నగారా

త్రిముఖ పోటీ - షెడ్యూల్ విడుదల, నామినేషన్లు షురూ



వెటర్నరీ యూనివర్సిటీ (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీలో ఉద్యోగుల సంఘం ఎన్నికల నగారా మోగింది. అధ్యక్షుడు-1, సహాధ్యక్షుడు-1, ఉపాధ్యక్షుడు-1, జాయింట్ సెక్రటరీ-1, ప్రధాన కార్యదర్శి-1, కార్యనిర్వాహక కార్యదర్శి-1, టెక్నికల్ సెక్రటరీ-1, కల్చరల్ అండ్ గేమ్స్ సెక్రటరీ-1, కోశాధికారి-1 పదవులకు ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ తాజాగా విడుదలైంది. ఈ నెల 18వ తేదీ నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. 22 మధ్యాహ్నం 2గంటలకు నామినేషన్ల పక్రియ ముగియనుంది. అదే రోజు నామినేషన్ల స్క్రూటినీ చేపడతారు. నామినేషన్ల ఉపసంహరణకు సాయంత్రం 5 గంటల వరకూ గడువు విధించారు. 23వ తేదీన అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. అదే రోజు ఎన్నికల గుర్తులు కేటాయిస్తారు. డిసెంబరు 7వ తేదీన ఎన్నికలు చేపడతారు. అదే రోజు ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఆర్.వేణు వ్యవహరించనున్నారు. ఈ ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రెండు బృందాలు నామినేషన్లు సమర్పించగా, మరో బృందం నామినేషన్లు సమర్పించే అవకాశం కనిపిస్తోంది. యూనివర్సిటీలో అటెండర్ నుంచి సూపరింటెండెంట్ స్థాయి దాకా గల 164 మంది ఉద్యోగులు ఎన్నికల్లో పాల్గొననున్నారు. ఇప్పటికే అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో వెటర్నరీ యూనివర్సిటీలో ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది.



రజనీకాంత్ నాయుడికి పలువురి శుభాకాంక్షలు

తిరుపతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ నాయుడి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బుధవారం పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. 11వ డివిజన్ పెద్దకాపు లేఅవుట్ ప్రజలు, గరుడాంజనేయు టాక్సీస్టాండ్, గరుడవారధి జీప్ అండ్ ఆటో యూనియన్ నేతలు, స్నేహితులు కలసి భారీ కేక్ కట్ చేశారు. 500మంది పేదలకు అన్నదానం చేశారు. శిల్పారామం వద్ద పెమ్మసాని సుమన్‌చౌదరి ఆధ్వర్యంలో, శ్రీదేవి కాంప్లెక్స్ వద్ద వీఆర్ సిస్టమ్ అధినేత వై.సురేష్ ఆధ్వర్యంలో కేకులు కట్‌చేసి, అన్నదానం చేశారు.ఉప్పలపాటి సాయిచౌదరి, గాలి పవన్ చౌదరి, హేమంత్‌కుమార్‌యాదవ్, జలపోతు చంద్రశేఖర రెడ్డి, రాజేష్‌రమణ యాదవ్, శ్రీనివాస యాదవ్, బాబీ చౌదరి, రఫీ, జిమ్ మురళి, ఆశాజ్యోతి, సుజాత, పూజ పాల్గొన్నారు.

శెట్టిపల్లె భూ సమస్యను త్వరగా పరిష్కరించండి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి భూ సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి శెట్టిపల్లె భూ సమస్యపై సమీక్ష నిర్వహించారు. శెట్టిపల్లె లబ్ధిదారులకు ఎంత మందికి భూములు కేటాయించాలనే దానిపై లే అవుట్ మ్యాప్ ఇవ్వాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో నగర పాలక కమిషనర్ మౌర్య, ఆర్డీఓ రామ్మోహన్, జిల్లా సర్వే అధికారి అరుణకుమార్, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

హోం గార్డుల సేవలు అభినందనీయం



హోంగార్డులనుద్దేశించి మాట్లాడుతున్న కమాండెంట్ మహేష్‌కుమార్

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో హోం గార్డుల సేవలు అభినందనీయమని రాయలసీమ హోం గార్డుల కమాండెంట్ మహేష్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండులో బుధవారం హోం గార్డుల పరేడ్ తిలకించి దర్బార్ నిర్వహించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూపోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. హోంగార్డుల సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రిజర్వు డీఎస్పీ చిరంజీవి, ఇన్‌స్పెక్టర్లు, రైటర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు




బహుమతులు పొందిన విద్యార్థులతో సూర్యనారాయణమూర్తి

తిరుపతి(లీలామహల్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని హెచ్ఎం సురేంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం గోవిందరాజస్వామి దక్షిణమాడ వీధిలోని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వార్షికోత్సవ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోజూ ఒక పేజీ అయినా చదవాలని, పుస్తకాలు చదవడంతో లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చన్నారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. గెజిటెడ్ లైబ్రేరియన్ సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయ సభ్యత్వం పొందాలని సూచించారు. వారానికి ఒక్కసారైనా గ్రంథాలయానికి వస్తామని ప్రతిజ్ఞ చేయించారు. టీచర్లు శంకర్, అసిస్టెంట్ లైబ్రేరియన్ సునీల్‌బాబు, గ్రంథాలయ సిబ్బంది రాధమ్మ, భారతి, ప్రతాప్‌రెడ్డి, మనిగండన్ పాల్గొన్నారు.

ఎస్వీయూ గ్రంథాలయాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, ఉద్యోగులకు ఎంతో జ్ఞానాన్ని అందించే గ్రంథాలయ అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతామని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పేర్కొన్నారు. యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయం అభివృద్ధిపై బుధవారం సంబంధిత అధికారులతో వారు సమీక్షించారు. ప్రధాన గ్రంథాలయ అభివృద్ధి కోసం ఈ రంగంలోని నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. పుస్తకాల పరిరక్షణ, సాంకేతిక పరిజ్ఞానం అమలు, మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెడతామన్నారు. కేంద్రీయ గ్రంథాలయ డైరెక్టర్ ప్రొఫెసర్ కొంగర సురేంద్ర బాబు, సలహా కమిటీ సభ్యులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కల్నల్ సతీందర్ దహియా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియా పేర్కొన్నారు. ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం తిరుపతిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇస్కాన్ టెంపుల్ సమీపంలోని వినాయక గ్రౌండ్స్‌లో ర్యాలీని ఆయన పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ తిరుపతి ప్రధాన మార్గాల గుండా సాగింది. సతీందర్ దహియా మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వాహన వినియోగం ద్వారా కొంతవరకూ పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రజలు ఎక్కువగా ఎలక్ట్రికల్ వాహనాలు వినియోగించే విధంగా అవగాహన తీసుకురావాలని కోరారు. పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. మాజీ సైనికులు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

కల్కి భూములను పేదలకు పంచాలి

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాబా వేషంలో కల్కి ఆక్రమించుకున్న భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని హేతువాద సంఘం అధ్యక్షుడు ఎన్.వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వరదయ్యపాళెం సమీపంలో నిర్మించిన కల్కి భవనాలను తొలగించాలని ఇప్పటికే కోర్టులు ఆదేశాలు జారీ చేశాయన్నారు. అయితే జిల్లాలో కొందరు అధికారులు వారితో కుమ్మక్కై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. బీఎన్ కండ్రిగ మండలంలో 21 ఎకరాల అటవీ భూములను ప్రభుత్వ స్వాధీనం చేయకపోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. భూములు పోగొట్టుకున్న బాధితులకు వాటిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌కు అభినందన

తిరుపతిరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లె పంచాయతీ ఎస్వీనగర్‌కి చెందిన తుమ్మల చెంగయ్యని బుధవారం పలువురు అభినందించారు. గౌడ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.కుమారస్వామి ఆధ్వర్యంలో ఉద్యోగులు, గౌడ సంఘ నాయకులు ఎస్వీనగర్‌లోని ఆయన స్వగృహంలో కలసి సన్మానించారు. సన్మానించిన వారిలో టీడీపీ రూరల్ మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, కత్తి సుధాకర్, ఎంపీటీసీ సోమశేఖర్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు తవ్వి ఇబ్బంది పెట్టారని కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంగళం మెయిన్ రోడ్డు నుంచి కమర్షియల్ ట్యాక్స్ కాలనీకి వెళ్లే రోడ్డు తవ్వి గ్రామస్తులను ఇబ్బందిపెట్టిన ఘటనలో ఆ గ్రామానికి చెందిన వెంకటరత్నం, మరికొందరిపై అలిపిరి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ రాంకిషోర్ కథనం మేరకు... కమర్షియల్ ట్యాక్స్ కాలనీ నుంచి అడవికి వెళ్లే దారిలో ఫారెస్ట్ అధికారులు ఫెన్సింగ్ వేశారు. దీంతో అటవీ ప్రాంతం నుంచి జంతువులు గ్రామంలోకి రాకుండా రక్షణగా ఉంటుంది. ఈ కంచెను ఆ ప్రాంతానికి చెందిన వెంకటరత్నం మరి కొందరు తొలగించి అటవీ ప్రాంతంలో మృతదేహాలను పాతి పెడుతున్నారు. గ్రామస్తులు అడ్డుకుని కంచె తొలగించవద్దని విజ్ఞప్తి చేసినా వినకుండా మళ్లీ కంచె తొలగించడంతో కొందరు అలిపిరి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో మరింత రెచ్చిపోయిన వెంకటరత్నం మంగళం రోడ్డు నుంచి కమర్షియల్ ట్యాక్స్ కాలనీకి వెళ్లే రోడ్డు తవ్వి గ్రామస్తులను ఇబ్బంది పెట్టాడు. ఈ విషయమై కాలనీ వాసులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అలిపిరి సీఐ రాంకిషోర్ కేసు నమోదు చేశారు.

ఎస్వీసీఈలో టెక్‌స్పార్క్ సదస్సు ప్రారంభం



తిరుపతిరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరకంబాడి రోడ్డులోని ఎస్వీకాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో జాతీయ స్థాయి టెక్‌స్పార్క్ రెండ్రోజుల సదస్సు బుధవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన చెన్నైకి చెందిన ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ కెరీర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వెంకట శాస్త్రితో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సుధాకర్‌రెడ్డి కలసి సదస్సును ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో అంతర్లీనమైన ప్రతిభా నైపుణ్యాల ప్రదర్శనకు ఇటువంటి సదస్సులు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఉద్యోగ, ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. పలు కార్యక్రమాలు నిర్వహించి, ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ తారకేశ్వర్ పాల్గొన్నారు.



ఆగమోక్తంగా అంగుళీ సంధాన సంప్రోక్షణం

శ్రీవారి ఆలయంలో బుధవారం సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2021లో శ్రీరాముని విగ్రహంలో ఎడమచేయి మధ్య వేలిభాగంలో చిన్నపాటి భిన్నం ఏర్పడింది. అప్పట్లో దీనికి బంగారు కవచాన్ని తొడిగి సవరించారు. సాధారణంగా ఇలాంటివి జరిగితే 12 ఏళ్లకోసారి సంప్రోక్షణం చేయడం ఆనవాయితీ. 2018లో టీటీడీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. మళ్లీ 2030లోనే సంప్రోక్షణ జరగాల్సి ఉంది. కానీ విగ్రహానికి జరిగిన లోపాన్ని సవరించేందుకు అప్పటివరకూ వేచిఉండకుండా ముందుగానే చేపట్టాలని జీయర్‌స్వాములు, ఆగమ సలహాదారులు, అర్చకుల కమిటీ సూచించింది. వారి సలహా మేరకు మంగళ, బుధవారాల్లో అంగుళీ సంధాన సంప్రోక్షణను ఆగమోక్తంగా నిర్వహించారు. బుధవారం హోమం నిర్వహించారు. జీయర్ స్వామి సమక్షంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, కృష్ణశేషాచల దీక్షితులు, గోవిందరాజ దీక్షితులు పూజలు చేశారు.

- తిరుమల(ఆంధ్రజ్యోతి)



జిల్లాకు ఆరుగురు డీఎస్పీల రాక

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): డీఎస్పీల బదిలీల్లో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఆరుగురిని నియమిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జె.రాంబాబును చిత్తూరు జిల్లా పోలీసు శిక్షణ కళాశాలకు, షేక్ బజిజాన్ సైదాను చిత్తూరు 8వ బెటాలియన్ డీఎస్పీగా, వి.శ్రీనివాసరెడ్డిని ఎర్రచందనం టాస్క్‌ఫోర్సుకు, జీవీ కృష్ణారావును చిత్తూరు 8వ బెటాలియన్‌కు, విజయానంద్‌ను వెంకటగిరిలోని 9వ బెటాలియన్‌కు, షరీఫ్‌ను తిరుపతిలోని ఎర్రచందనం టాస్క్‌ఫోర్సుకు నియమించారు. త్వరలో వారికి కేటాయించిన స్థానాల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



తెల్లావారకముందే.. పల్లె రేచింది!





పల్లె అందాలు పనిపాటలతో పెనవేసుకుని ఉంటాయి. పనులకాలంలో చెట్టూచేమా.. పరిసరాలన్నీ పచ్చదనంతో కళకళలాడితే, మనుషుల ముఖాల్లో సంతోషం, సంతృప్తీ పొంగిపొరలుతుంటాయి. అడపాదడపా కురుస్తూనేవున్న వానలతో తిరుపతి జిల్లాలో వ్యవసాయ పనులు జోరుగా మొదలయ్యాయి. చెరువుల్లోకి కొత్త నీళ్లు చేరాయి. వంకలు పారుతున్నాయి. తెల్లవారకముందే రైతులూ, రైతు కూలీలూ పనిముట్లతో బయలుదేరుతున్నారు. 'అన్నా..వదినా.. మామా..బావా.. పిల్లా..' అంటూ చతుర్లాడుకుంటూ పొలాల్లోకి దిగుతున్నారు. ఒకవైపు నారు పెరికి కట్టలు కడుతున్నారు.. మరొకవైపు అడుసుదున్ని మడులను సిద్ధం చేస్తున్నారు.. ఇంకోవైపున నాట్లేస్తున్నారు. ముందస్తుగా నాటి ఏపుగా పెరిగిన పైర్లలో మందులు చల్లుతున్నారు.. పురుగూ పుట్రా ఏరుకుతింటూ రైతునేస్తాలు కొంగలు గుంపులుగా ఎగురుతూ వాలుతూ కనువిందు చేస్తున్నాయి. బుధవారం ఇంకా మంచు తెరలు వీడని వేకువ వేళ.. తిరుపతి సమీపంలోని అన్నాసాంపల్లి పరిసరాల్లోని ఈ అందాలను ఆంధ్రజ్యోతి తిరుపతి ఫోటోగ్రాఫర్ ఫోటో పట్టి అందిస్తున్నారు..



















వ్యాపారుల లైసెన్సుల డిజిటలైజేషన్

● టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి



వ్యాపారితో మాట్లాడుతున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, నవంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వ్యాపారుల లైసెన్సులను డిజిటలైజేషన్ చేసి దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకుంటామని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. ఒకే లైసెన్స్‌తో రెండు మూడు ప్రాంతాల్లో వ్యాపారాలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. అనధికారికంగా వ్యాపారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం సాయంత్రం ఆయన తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. డీఎంబీ రోడ్డులోని అన్నపూర్ణ హోటల్ భవనాన్ని ఆయన పరిశీలించారు. దుకాణాల లైసెన్సులను తనిఖీ చేశారు. ఓ టీ దుకాణంలో టీ తాగి ధరలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ.. అన్నపూర్ణ హోటల్ శిథిలావస్థకు చేరుకోవడంతో పరిశీలించామన్నారు. ఇంజినీరింగ్ అధికారుల నివేదిక ఆధారంగా త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆయన వెంట డిప్యూటీఈవో ఆశాజ్యోతి, ఎలక్ట్రికల్ డీఈ చంద్రశేఖర్, రెవెన్యూ ఏఈవో భాస్కర నారాయణ చౌదరి ఇతర అధికారులు పాల్గొన్నారు.

గరుడాచలం నుంచీ అరుణాచలానికి

● సంస్కృత వర్సిటీ విద్యార్థి ఆచూకీ లభ్యం



కశ్యప ఆదిత్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీ డిగ్రీ ఫైనలియర్ విద్యార్థి కశ్యప ఆదిత్య ఆచూకీని పోలీసులు గుర్తించారు. యూనివర్సిటీలోని గరుడచాలం హాస్టల్‌లో వసతి పొందుతున్న ఇతడు.. కనిపించడం లేదంటూ పోలీసులకు కుటుంబీకులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. హాస్టల్‌లోనే ఫోన్, గుర్తింపు కార్డు వదిలిపెట్టి వెళ్లారు. అరుణాచలం నుంచీ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసినట్టు పోలీసులు తెలిపారు. దీంతో విద్యార్థి కశ్యప ఆదిత్య లోకేషన్‌ను పోలీసులు కనుక్కున్నారు. తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్‌కు రప్పించారు. బుధవారం సాయంత్రం అతడిని తండ్రి ప్రకాష్, సోదరుడు సాత్విక్‌సూర్యకు అప్పగించారు.

ముగ్గురు సీఐలకు రెగ్యులర్ ఉత్తర్వులు


తిరుపతి(నేరవిభాగం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అటాచ్‌మెంటులో పనిచేస్తున్న ముగ్గురు సీఐలను ఆయా స్థానాల్లో రెగ్యులర్ చేస్తూ అనంతపురం డీఐజీ షిమోషీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు, చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి, యూనివర్సిటీ సీఐ రామయ్య ఉన్నారు. పనితీరు, క్రమశిక్షణ, ఇతరత్రా కారణాలను కొలమానంగా తీసుకుని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు

తిరుమల, నవంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం వివరాలను టీటీడీ బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 62,248 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 18,852 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

పంచారామాలకు ప్రత్యేక ప్యాకేజీ టూర్

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పంచారామాలను సందర్శించేందుకు ఏపీఎస్ ఆర్టీసీ శుక్రవారం ప్రత్యేక ప్యాకేజీ టూర్ ఏర్పాటు చేసింది. మధ్యాహ్నం ఒంటి గంటకు సెంట్రల్ బస్టాండులో సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుంది. నెల్లూరు, గుంటూరు, విజయవాడ మీదుగా సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతి నుంచి తిరుగు ప్రయాణమై ఈనెల 24న ఉదయం తిరుపతికి చేరుకుంటుంది. టికెట్ ధర రూ.2,500గా నిర్ణయించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ కోరారు.



పూజలు చేస్తున్న వేదపండితులు

వేదోక్తంగా లక్ష బిల్వార్చన

శ్రీకాళహస్తీశ్వరాలయంలో లక్ష బిల్వ, కుంకుమార్చను వేదోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ అలంకార మండపంలో కార్యక్రమాన్ని రుత్వికులు ప్రారంభించారు. ఆలయ అనువంశిక ప్రధాన అర్చకుడు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో మొదట సంకల్ప పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. మధ్యాహ్నం వరకు మూడు కాలాల పాటు అర్చన సాగింది. అనంతరం సాయంత్రం నాలోగ కాలం అర్చన చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు సంబంధం గురుకుల్, ఏఈవో లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, వేదపండితులు, అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

గాడిలో పంచాయతీ పాలన

● జిల్లాలో గ్రేడ్-5 కార్యదర్శులు 220 మందికి డీడీవో అధికారాలు

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పాలనను గాడిలో పెట్టడానికి 'కూటమి' ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో 774 పంచాయతీలు ఉండగా అందులో 22 మేజర్. అన్ని పంచాయతీలకు కార్యదర్శులు ఉండేలా చూస్తోంది. సచివాలయ పరిధిలో పనిచేసే గ్రేడ్-5 కార్యదర్శులకు గతంలో డీడీవో అధికారం ఉండేది కాదు. వారికి డీడీవో అధికారాలు ఇవ్వాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లాలోని సచివాలయాల్లో పనిచేస్తున్న 220 మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో (డ్రాయింగ్ అండ్ డిస్బర్‌మెంట్ ఆఫీసర్) అధికారం ఇస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల నుంచే అమల్లోకి వచ్చింది. తద్వారా వీరికి చెక్ పవర్ రావడంతో పంచాయతీ అభివృద్ధికి అవసరమైన నిధులను డ్రా చేసి వినియోగించే అధికారం ఉంటుంది. దీంతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు సజావుగా సాగతాయి. సచివాలయంలో ఉండే గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారులు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాతకమైందని డీపీవో సుశీలా దేవి అన్నారు. తద్వారా చిన్న పంచాయతీల్లోను గ్రామాభివృద్ధికి అవసరమయ్యే నిధులను డ్రా చేసుకునే అవకాశం దక్కుతుందన్నారు.

హైదరాబాద్ బయల్దేరిన నారా భువనేశ్వరి



నారావారిపల్లెలో భువనేశ్వరికి వీడ్కోలు పలుకుతున్న రవినాయుడు, నరసింహయాదవ్. శ్రీధర్‌వర్మలు

చంద్రగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్ బయలుదేరారు. మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలకు సీఎం, ఆయన కుటుంబ సభ్యులు ఇటీవల హాజరైన విషయం విదితమే. సీఎం సోమవారం మధ్యాహ్నం అమరావతికి వెళ్లగా భువనేశ్వరి నారావారిపల్లెలో ఉన్నారు. బుధవారం ఆమె రేణిగుంట విమానాశ్రయం నుంచి హైదరాబాదుకు బయలుదేరి వెళ్లారు. ఈసందర్భంగా నారావారిపల్లెలో శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, యాదవ కార్పోరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీదర్‌వర్మ, గ్రామస్థులు ఆమెకు వీడ్కోలు పలికారు. రామ్మూర్తి నాయుడు కర్మక్రియల నేపథ్యంలో భువనేశ్వరి తిరిగి ఈనెల 25న రానున్నట్లు సమాచారం. కాగా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. ఆయన కుమారులు సినీహీరో రోహిత్, గిరీష్‌లను పరామర్శించారు.

● సమీక్షలు- సమావేశాలు

వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పనులను వేగవంతం చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి కారిడార్ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. పారిశ్రామికవాడలకు కావాల్సిన నీటి సరఫరా పైపులైన్ పనుల పురోగతిపై ఆరా తీశారు. కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వీరశేఖర్‌రెడ్డి, డిప్యూటీ జోనల్ మేనేజర్ రాంబాబు పాల్గొన్నారు.

గడువులోగా 'జలజీవన్' పనులు పూర్తి చేయాలి

జలజీవన్ మిషన్ పనులను గడవులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 2,532 పనుల్లో భాగంగా 1,333 పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులకు సంబంధించి సర్వే కొనసాగుతోందన్నారు. ఈ సర్వేను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొళాయి కనెక్షన్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. సీపీడబ్ల్యూఎస్ సమగ్ర నీటి పథకం పనులను పూర్తి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా వంటి పనులను నాణ్యతతో నిర్వహించాలన్నారు. అనంతరం 'మన మరుగుదొడ్డి మన గౌరవం' పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విజయకుమార్, అన్ని మండలాల ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

రెండు గంటలు ఆలస్యంగా సప్తగిరి ఎక్స్‌ప్రెస్

తిరుపతి(ఆటోనగర్)నవంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుపతి-చెన్నై మధ్య రోజూ రెండు పర్యాయాలు రాకపోకలు సాగిస్తున్న సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బుధవారం రెండు గంటలు ఆలస్యంగా నడిచింది. ఉదయం తిరుపతికి 9.50కు చేరుకుని 10.10 గంటలకు తిరిగి బయలుదేరాల్సి ఉంది. అయితే 12.15 గంటలకు తిరుపతికి చేరుకుని 12.35కు బయలుదేరి వెళ్లింది. తిరిగి తిరుపతికి సాయంత్రం 5.55 గంటలకు చేరుకుని 6.10 గంటలకు బయలుదేరాల్సి ఉన్నా రెండు గంటలు ఆలస్యమైంది. ఈ ఎక్స్‌ప్రెస్‌ను అధికారులు రీషెడ్యూల్ చేశారు.

పుత్తూరు వార్తలు

రోడ్ల మీదే పేరుకుపోతున్న చెత్త

- మరమ్మతులకు గురైన చెత్త సేకరణ వాహనాలు
- తుప్పుపట్టిన డస్ట్‌బిన్లు
- పట్టించుకోని మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది



ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద పేరుకుపోయిన చెత్త



మరమ్మతులకు గురైన చిన్న కాంపాక్టర్ వాహనం

పుత్తూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో డస్ట్ బిన్లు పాడైపోవడంతో రోడ్ల మీద చెత్త పేరుకుపోతోంది. స్వచ్ఛ భారత్ పథకం కింద 2018లో మున్సిపాలిటీకి రెండు చెత్త సేకరణ వాహనాలతో పాటు 80 డస్ట్ బిన్లు వచ్చాయి. ఈ రెండు వాహనాలతో సుమారు 15 టన్నుల చెత్త డంపింగ్ యార్డుకు చేరేది. నెల రోజుల క్రితం చెత్త సేకరించే వాహనాల్లో చిన్నది మరమ్మతులకు గురైంది. అలాగే మరో మూడు ట్రాక్టర్లు కూడా చెత్త సేకరలో ఉన్నాయి. వీటిలో ఒకటి మరమ్మతులకు గురైంది. స్వచ్ఛ నిధులతో మంజూరైన డస్ట్ బిన్ల గొళ్లాలు ఊడిపోవడంతో వాహనం ద్వారా చెత్త సేకరించలేకపోతున్నారు. దీంతో పారిశుధ్య సిబ్బందే చెత్తనే వాహనాల్లో వేయాల్సి వస్తోంది. హోటళ్లతో పాటూ తోపుడుబండ్ల మీద టిఫిన్, తినుబండారాలు విక్రయించే బండ్ల సంఖ్య దాదాపు రెండువందలుగా వుంది. వ్యాపారులందరూ సాయంత్ర సమయంలో చెత్తను రోడ్ల మీద పారేస్తున్నారు. దీంతో ఉదయానికల్లా రోడ్లు చెత్తతో పేరుకు పోతున్నాయి. చెత్త పేరుకోపోవడంతో దోమలు వ్యాప్తి చెంది పట్టణవాసులు జ్వరాల బారిన పడుతున్నారు. దీనిపై మున్సిపల్ అధికారుల ఇకనైనా చర్యలు తీసుకోవాల్సి ఉంది. కాగా డస్ట్ బిన్ల కోసం త్వరలో టెండర్లు ఆహ్వానిస్తున్నామని మున్సిపల్ ఏఈ కార్తిక్ చెప్పారు. ఇప్పుడున్న వాటికి అదనంగా మరి కొన్ని డస్ట్ బిన్లను కొనుగోలు చేసేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించేందుకు కూడా పరిశీలిస్తున్నామని తెలిపారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

పుత్తూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. ఆ సందర్భంగా మున్సిపాలిటీలోని నాలుగు ప్రధాన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీల్లో విజేతలైన 47 మంది విద్యార్థులకు బహుమతులను అందించారు. విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఎంఈఓ -1 తిరుమలరాజు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 బాలసుబ్రమణ్యం, గ్రంథాలయాధికారి మీనాకుమారి, నాగరత్నమ్మ, శంకరయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

పుత్తూరు అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని వెంకటాద్రిపురానికి చెందిన విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పెరుమాళ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. వెంకటాద్రిపురానికి చెందిన రవికి ముగ్గురు సంతానం. పురుషోత్తం(20) పెద్ద కొడుకు. రోజువారీగా పెరుమాళ్ కళాశాలకు మంగళవారం ఉదయం బయలుదేరి వెళ్లాడు. సాయంత్రం కళాశాల నుంచి స్నేహితుడు దుర్గాప్రసాద్‌తో కలిసి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. చెర్లోపల్లి శాంతినగర్ వద్ద వస్తుండగా కార్వేటినగరం నుంచి వస్తున్న మరో ద్విచక్రవాహనదారుడు వెనుక నుంచి వీరిని ఢీ కొట్టాడు. పురుషోత్తం, దుర్గాప్రసాద్ కిందపడిపోయారు. ఈ క్రమంలో పుత్తూరు నుంచి కార్వేటినగరం వైపు వస్తున్న ద్విచక్రవాహనం పురుషోత్తం గొంతుపై నుంచి దూసుకెళ్లడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హుటాహుటిన పుత్తూరు ఆస్పత్రికి తరలించారు. ప్రాథమికి చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పురుషోత్తం మృతి చెందాడు. ఇంటికి పెద్ద కొడుకు గొప్ప చదువులు చదివి ప్రయోజకుడై అండగా నిలుస్తావని అనుకున్నామని, ఇంతలో ఘోరం జరిగిపోయిందని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. సీఐ సురేంద్రనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు అక్షరాభ్యాసం

వడమాలపేట, నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): సామాజిక వేడుకల్లో భాగంగా మండలంలోని కాయం ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో కొత్తగా చేరిన పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాల సందర్భంగా వడమాల సెక్టార్ సూపరవైజర్ మనీలా మాట్లాడుతూ... విద్యా హక్కు చట్టం ప్రకారం పిల్లలను బడికి పంపాలని, పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రుల పెంపకంలోనే ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు పండించి పిల్లలకు ఆహారంగా పెడుతున్నామని చెప్పారు.

27నుంచి ఏఐఎస్‌ఎఫ్ సభలు

పుత్తూరు టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): యూనివర్శిటీల్లో ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ కోరారు. పట్టణంలోని ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాలలో ఈనెల 27నుంచి 30వ తేది వరకు విజయనగరంలో జరిగే ఏఐఎస్‌ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోస్టులను భర్తీ చేయాలని, మెగా డీఎస్సీ నిర్వహించాలన్నారు. మహేష్, బాలాజీ, తేజ, గేల్స్ అనూష, వెన్నె, చందన, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ జయలక్ష్మి

సత్యవేడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు అరికట్టేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు చొరవ చూపాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా పీడీ జయలక్ష్మి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణ బాధ్యత అంగన్‌వాడీలదే అని స్పష్టం చేశారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పయ్యే వరకు వారి ఆరోగ్యానికి సంబంధించిన అన్ని విషయాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా రక్తహీనత ఉన్న గర్భిణులు, బాలింతలు, శిశువులను గుర్తించి ఆరోగ్య సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. బాలామృతాన్ని సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలన్నారు. సీడీపీవో దేవకుమారి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి: సీపీఎం

పిచ్చాటూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలు, జిల్లాలోఉన్న రెండు ఫ్యాక్టరీల్లో రైతులకు రూ.60 కోట్ల బకాయిల సాధనకు మహాసభలో కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరి జనార్దన్ తెలిపారు. తిరుపతి జిల్లా 14వ మహాసభలను డిసెంబరు 1, 2 తేదీల్లో సత్యవేడులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని భూ సమస్యల పరిష్కారం, ఉపాధి హామీ పథకం సక్రమ అమలు, కార్మికులకు హక్కులు, కనీస వేతనాల సాధన కొరకు మహాసభలో కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, మండల కార్యదర్శి రామచంద్రారెడ్డి, నారాయణవనం మండల కార్యదర్శి మునిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

పాముకాటుతో వ్యక్తి మృతి

బాలాయపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లెమాల గ్రామానికి చెందిన కందాటి రంగయ్య(54) పాముకాటుతో బుధవారం మృతి చెందాడు. కుటుంబసభ్యుల వివరాల మేరకు... బుధవారం వేకువజామున రంగయ్య ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

చిల్లకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం గిరిజన కాలనీకి చెందిన బాలిక తప్పిపోయిందని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ సురేష్‌బాబు బుధవారం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

కోట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని ఎన్‌సీఆర్ నగర్‌కు చెందిన షేక్ రషీద్ అదృశ్యం అయినట్లు అతని తల్లి షేక్ షాజిదా బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రషీద్ రెండు రోజుల క్రితం పాఠశాలకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. చుట్టుపక్కల వారితో పాటు బంధువుల ఇళ్లవద్ద విచారించినప్పటికీ ఆచూకి లభ్యం కాలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పవన్‌కుమార్ చెప్పారు.

కాలుష్య కోరల్లో నెర్రికాలువ





నెర్రికాలువలో రంగుమారిన నీళ్లు - సూళ్లూరు వద్ద వాటంబేడుకు వెళ్లే మార్గంలో నెర్రికాలువ పక్కనే పడేసిన వ్యర్థాలు

సూళ్లూరుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలో పంట కాలువల్లో వ్యర్థాలు, మురుగునీరు చేరడంతో సాగునీరంతా కలుషితమవుతోంది. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో భూములకు సాగు నీరందించే నెర్రికాలువ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. సూళ్లూరుపేట పట్టణంలోని ఇళ్లలోని వ్యర్థపునీరు, మురుగుతో పాటు ఇతర వ్యర్థాలు కాలువలోకి చేరుతున్నాయి. దొరవారిసత్రం మండలం తనియాలి వద్ద కాళంగి నదికి అనుసంధానంగా ఉన్న నెర్రికాలువ గుండా కుదిరి, చెరువు కండ్రిగ, దేగలపాలెం, కారిజాత, సూళ్లూరు తదితర 15 చెరువుల ద్వారా దాదాపు 18వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. నెర్రి కాలువ ఆక్రమణకు గురవడంతో పాటు కాలుష్య కోరల్లో చిక్కుకోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సూళ్లూరుపేట పట్టణంలో వాడకనీరంతా కాలువలోకి వదులుతున్నారని పదేళ్ల కిందట రైతులు ఆందోళన చేసిన ఎవరూ పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమణలు తొలిగించి నెర్రికాలువ ఆధునీకరణకు శ్రీకారం చుట్టినా ఆచరణకు నోచుకోలేదు. అనంతరం వైసీసీ ప్రభుత్వం ఆర్భాటాలు చేసినా పనులు మాత్రం చేపట్టలేదు. కోటపోలూరు రైల్వేలైన్ ఆనుకొని ఉన్న పుచ్చాకాలువ పరిస్థితి కూడా అధ్వానంగా ఉంది. ఈ కాలువ ద్వారా కోటపోలూరు, జంగాలపల్లి, ఆబాక గ్రామాల పరిధిలో భూములకు సాగునీరు అందుతోంది. ఇందులోనూ వ్యర్థాలు పేరుకుపోయి సాగునీరు పారక రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి పంట కాలువలను బాగుచేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రయాణికులకు మెరుగైన వసతుల కల్పనకు చర్యలు



రైల్వేప్రొటెక్షన్ ఫోర్స్ కార్యాలయాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న సౌత్‌సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్

గూడూరు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో ప్రయాణికులకు మెరుగైన వసతులను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. బుధవారం స్థానిక రైల్వే స్టేషన్‌లోని నూతనం ఏర్పాటు చేసిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్లాట్‌ఫాంలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలన్నారు. బుకింగ్ కౌంటర్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రైల్వే స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఛీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, రైల్వేప్రొటెక్షన్ ఫోర్స్ ఐజీ ఆరోమాసింగ్ ఠాగూర్, డీఆర్ఎ నాగేంద్రపటేల్, మధుసూదన్‌రావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మురళీకృష్ణ, డీపీవోలు

కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో బుధవారం గురుకులాల జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే పోటీల్లో క్రీడలను అంబేడ్కర్ గురుకులాల రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మురళీకృష్ణ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల డీపీవోలు జయలక్ష్మి, జయ క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. గుంటూరు, ప్రకాశం, ఉమ్మడి నెల్లూరు జిల్లాల్లోని అంబేడ్కర్ గురుకులాలకు చెందిన 17 జూనియర్ కళాశాలలు, 15 గురుకుల పాఠశాలలకు చెందిన 680 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. మొదటి రోజు 100 మీటర్ల పరుగు పందెం, షార్ట్‌పుట్, లాంగ్‌జంప్, డిస్కస్‌త్రో పోటీలను ఫిజికల్ డైరెక్టర్లు రాజ్‌కుమార్, శ్రీరేష్ ప్రారంభించారు. స్థానిక ప్రిన్సిపాల్ అద్దూరు వెంకటేశ్వర్లు, ఎంఈవో దారా మస్తానయ్య, ఎంపీపీ అంజమ్మ, జడ్పీటీసీ కోటయ్య, ఎంపీటీసీలు సురేష్, షంషుద్దీన్ క్రీడాకారుల నుంచి క్రీడా వందనం స్వీకరించారు.

గురుకులాల జోనల్ క్రీడల్లో పేట విద్యార్థినుల ప్రతిభ



క్రీడల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థినులు

నాయుడుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ గురుకులాల జోనల్‌స్థాయి క్రీడల్లో నాయుడుపేట మండలం పుదూరు గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ రూత్‌రమోలా బుధవారం తెలిపారు. ప్రకాశం జిల్లా వినుకొండలో 5 రోజుల పాటు అంబేడ్కర్ గురుకులాల జోనల్ స్థాయి క్రీడల్లో నిర్వహించారు. ఇందులో పుదూరు గురుకులంలో సీనియర్ ఇంటర్ చదువుతున్న సుధా 800, 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, హైజంప్, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయస్థానం, సీనియర్ ఇంటర్ చదువుతున్న భార్గవి డిస్కస్‌త్రోలో ప్రథమస్థానం, 9వ తరగతి చదువుతున్న భావన 100 మీటర్ల రిలే పరుగు పందెంలో ద్వితీయస్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, 200 మీటర్లల్లో ప్రథమస్థానం, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం, 10వ తరగతి చదువుతున్న మహతి 100 మీటర్ల రిలేలో ద్వితీయ స్థానం, 9వ తరగతి చదువుతున్న లాస్య 1500 మీటర్లలో ద్వితీయస్థానం, 10వ తరగతి చదువుతున్న హారిక 100 మీటర్ల రిలేలో ద్వితీయస్థానం సాధించినట్లు తెలిపారు. వీరిని గురుకుల పీఈటీ సుబ్బమ్మ, అధ్యాపకులు శశి, సుభాషిణి అభినందించారు.

మున్సిపాలిటీలో సిబ్బందిని నియమించండి

గూడూరు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గూడూరు మున్సిపాలిటీలో సిబ్బందిని నియమించాలని బుధవారం రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ హరికృష్ణకు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. బుధవారం గుంటూరులో హరికృష్ణను కలిసిన ఎమ్మెల్యే గూడూరు మున్సిపాటిలో సిబ్బంది కొరత గురించి వివరించారు. కార్యాలయంలో డిప్యుటేషన్ లేదా రెగ్యులర్ సిబ్బందిని నియమించాలని కోరారు.

తీర ప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరు పట్ల హర్షం

గూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామాల అభివృద్ధికి రూ.4.14 కోట్లు మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని చిల్లకూరు మండలం తమ్మినపట్నం పంచాయతీ గమ్మళ్లదిబ్బ నుంచి బీచ్ వరకు బీటీ రోడ్డుకు రూ.3.11, వాకాడు మండలం జమీన్‌కొత్తపాళెం పంచాయతీ తూపిలిపాళెం గ్రామం నుంచి బీచ్ వరకు బీటీ రోడ్డుకు రూ.66 లక్షలు, దుగరాజపట్నం పంచాయతీ కొండూరుపాళెం గ్రామం నుంచి బీచ్ వరకు బీటీ రోడ్డుకు రూ.37 లక్షలు మంజూరు చేశారన్నారు. ఇందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

వాకాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాకాడు ఆర్టీసీ డిపో వద్ద ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ (సీఐటీయూ) పిలుపు మేరకు కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ సెక్రటరీ షేక్ వజీర్‌బాషా మాట్లాడుతూ నైట్‌హాస్, డేహాస్ అలవెన్స్‌లు, టీఏ బిల్లుల చెల్లింపులు, 2019 సర్క్యులర్ అమలు, 12వ పీఆర్‌సీ అమలు, పెండింగ్ డీఏలు విడుదల, లివెన్ కాన్సెంట్‌లు చెల్లింపు, ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లకు గుర్తింపుకార్డులు, గ్యారేజ్ కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ బలరామయ్య, కార్యదర్శి పీడీ రమణయ్య తదితర కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

తడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. తడ, వేనాడులోని గ్రంథాలయాలలో ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ అధికారి కల్యాణి, వేనాడు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంత కుమారి పాల్గొన్నారు.

పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

నాయుడుపేట టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి గణేష్ అన్నారు. మండలంలోని విన్నమాల, కారువారి మంచికండ్రిగ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటల వద్దకెళ్లి రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పంటల బీమా పథకాన్ని అమలు పరుస్తున్నారని తెలిపారు. డిసెంబరు 31వ తేదీలోగా రైతులు మీసేవా కేంద్రం, సీఎస్‌సీ సెంటర్లు, బ్యాంకుల ద్వారా ఎకరాకు వరి పంటకు రూ.630 ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవచ్చన్నారు. ఈ పథకం వలన తుఫాన్లు, కరువు, అకాల వర్షాలు వచ్చినప్పుడు రైతులకు ఆర్థికసాయం అందుతుందన్నారు.

గంగ కాలువ ఆక్రమణపై ఫిర్యాదు



ఆక్రమణకు గురైన కాలువను పరిశీలిస్తున్న తెలుగుగంగ అధికారులు

చిట్టమూరు, నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యాకసిరి పాటిమిట్ట గ్రామంలో ఓ భూస్వామి తెలుగుగంగ కాలువ ఆక్రమించి తంతి లాగారని రైతులు తెలుగుగంగ ఉన్నతాధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు. యాకసిరి, తన్నమాలకు వెళ్లె తెలుగుగంగ కాలువ నుంచి ఓ భూస్వామి మట్టి అక్రమంగా తరలించారని తెలిపారు. అంతేకాక కాలువ కట్టను ఆక్రమించి తంతి లాగేసి రైతులను పొలాల్లోకి వెళ్లకుండా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తెలుగుగంగ ఏఈ పూర్ణచంద్రరావు ఆక్రమణకు గురైన గంగ కాలువను పరిశీలించారు. ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకొని తంతిని తొలగించాలని రైతులు అధికారులను కోరారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

సూళ్లూరుపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ అన్నారు. స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల గ్రంథాలయంలో దాదాపు 17వేలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వకృత్వ, వ్యాసరచన పోటీలు, క్విజ్ నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, గ్రంధాలయ అధికారి కే.రమేష్, జాక్ కోఆర్డినేటర్ వీబీ.రాజా అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



ఆక్రమణలను పరిశీలిస్తున్న ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు

గూడూరు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోడ్డు మార్జిన్‌లో దుకాణాలను ఏర్పాటు చేసుకున్న ఆక్రమణదారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ నుంచి ఐసీఎస్ రోడ్డు, సంగం థియేటర్ ప్రాంతాల్లో ఆక్రమణలను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్డు పక్కన ఆక్రమణల వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

వెంకటగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని విశ్వోదయ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ విజయశేఖర్ అన్నారు. బుధవారం కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

స్వానిధి, స్వాభిమాన్ పక్వా పక్షోత్సవాలపై అవగాహన

గూడూరు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్వానిధి-బీ, స్వాభిమాన్-బీ పక్వా పక్షోత్సవాలపై బుధవారం సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, క్యూఆర్‌కోడ్ వంటి వాటిపై వీధి వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. పీఎం స్వానిధి పథకం ద్వారా మొదటి విడతలో రూ.10వేలు, తరువాత రూ.20వేల రుణాలను పొందవచ్చునన్నారు. రుణాలను తిరిగి చెల్లిస్తే రూ.50వేల వరకు రుణాలు పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏపీజీబీ బ్యాంకు జిల్లా కోఆర్డినేటర్ గురుస్వామి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పెంచలయ్య, సీఈవో చందన, సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో అప్రమత్తతే కీలకం



ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంతో తహసీల్దారు నరసింహారావు, సీఐ మురళీకృష్ణ, ఎంపీడీవో ప్రమీలారాణి తదితరులు

సూళ్లూరుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో అధికారుల అప్రమత్తతే కీలకమని ఎన్‌డీఆర్‌ఎఫ్ ఎస్ఐ సుమన్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం ఆధ్వర్యంలో వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విజయవాడకు చెందిన ఎన్‌డీఆర్‌ఎఫ్ ఎస్ఐ సుమన్ కుమార్ మాట్లాడుతూ వరదలు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలలో అధికారులకు క్షుణ్ణంగా వివరించారు. విపత్తులు సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై గురువారం కోటపోలూరు చెరువులో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంచే రిహార్సల్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీవో ప్రమీలారాణి, సీఐ మురళీకృష్ణ, వైద్యాధికారి రమణయ్య, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రికి వీల్‌చైర్ అందజేత

గూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రికి శ్రీకృష్ణసేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ సహకారంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వీల్‌చైర్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే గర్భిణులను, కాన్పులు చేయించుకున్న వారిని వార్డుకు తీసుకువెళ్లేందుకు సౌకర్యంగా వీల్‌చైర్‌ను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, మునిగిరీష్, దశరథరామిరెడ్డి, పీవీకృష్ణయ్య, ఎన్‌వీరత్నం, రాంప్రసాద్, ఎస్‌వీఎస్ ప్రసాద్, వెంకటేశ్వర్లురెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ షరీనా తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా శ్రీకృష్ణసేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక గుమళ్లపాళెంలోని సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో, మైఫ్రెండ్స్ అసోసియేషన్ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మహేశ్వరి, ఉషా, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

చిట్టేడులో పొలం పిలుస్తోంది

కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు, రుద్రవరం గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలోపొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వేరుశనగ పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. వరి సాగు చేస్తున్న రైతులు ఎకరానికి రూ.630, వేరుశనగ పంట ఎకరానికి రూ.450 ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు భూషణ్, ప్రశాంతి, సురేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంటల బీమాతో అన్నదాతలకు ధీమా

ఓజిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దిగుబడి చేతికి వచ్చే సమయంలో ఎదురౌతున్న ప్రకృతి విపత్తుల నేపథ్యంలో రైతులు తమ పంటలకు బీమా చేసుకోవడం ద్వారా ధీమాగా ఉండొచ్చని ఏవో విజయలక్ష్మి అన్నారు. ఓజిలి మండలం రాచపాళెం, ఓజిలి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని రైతులకు పంటలసాగు, ఎరువులు, పురుగు మందుల వాడకం, చీడపీడల నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే పంటల బీమా ప్రాముఖ్యం, రైతులకు ప్రభుత్వ అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ధనుంజయ, రైతులు వెంకటరమణారెడ్డి, శీనయ్య పాల్గొన్నారు.

30వరకు రాజీవ్‌నగర్ అక్రమాలపై ఫిర్యాదులు



తహసీల్దారు లక్ష్మీనారాయణ

శ్రీకాళహస్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో అక్రమాలపై పట్టాదారులు ఈ నెల 30వ తేదీ వరకు ఫిర్యాదు చేయవచ్చని తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. రాజీవ్‌నగర్ భూ అక్రమాల పరిష్కారంపై బుధవారం తహసీల్దారు మీడియాతో మాట్లాడారు. సెప్టెంబరులో రాజీవ్‌నగర్ అక్రమాలపై నిగ్గు తేల్చేందుకు 54 బృందాలతో ఒకే సారి సమగ్ర సర్వే నిర్వహించామన్నారు. మొత్తం రాజీవ్‌నగర్‌లో 6,300 ఇళ్లస్థలాలు ఉన్నాయన్నారు. సమగ్ర సర్వేలో భాగంగా పెద్దసంఖ్యలో ఫిర్యాదులు వెల్లువెత్తాయన్నారు. అన్ని ఫిర్యాదులపై విచారణ చేపట్టామన్నారు. అయితే రాజీవ్‌నగర్‌లో పట్టాలు పొందిన సుమారు 2వేలమంది ఆచూకీ తెలియలేదన్నారు. లబ్ధిదారులు ఈనెల 30వ తేదీ వరకు శ్రీకాళహస్తి తహసీల్దారు కార్యాలయంలో సంబంధిత పత్రాలను సమర్పించాలన్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళంగి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు లోడ్ ట్రాక్టర్లు, మూడు ఖాళీ ట్రాక్టర్లను సీఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో సిబ్బంది కాళంగి నది దగ్గర స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కాళంగి నదిలో అధికారికంగా ఇసుక రీచ్ లేదన్నారు. నది నుంచి ఇసుకను ఇతర మండలాలకు తరలించకూడదని, మండలంలోని ప్రజల అవసరాలకు మాత్రమే వాడుకోవాలన్నారు. కొందరు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు పాల్గొన్నారు.

పని గంటల పెంపుపై ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో పనిగంటలను ఉదయం 9నుంచి సాయంత్రం 5 గంటల వరకు చేయడంపై పట్టణంలోని సరస్వతిబాయి పురపాలక సంఘ పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ఉదయం ప్రార్థన సమయానికి ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఆడిట్ సభ్యుడు వెంకటాద్రి మాట్లాడుతూ పాఠశాలకు ఇతర ప్రాంతాల నుంచి హాజరయ్యే బాలికలు ఎక్కువ సంఖ్యలో ఉంటారన్నారు. దీంతో వారు ఇబ్బందిపడాల్సి వస్తుందని తెలిపారు.

అశాస్త్రీయం...

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పనిగంటలు పొడగించడం అశాస్త్రీయమని ఏపీటీఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ విద్యాశాఖ అధికారుల ఆదేశాలతో పైలెట్ ప్రాజెక్టు కింద ఒక ఉన్నత పాఠశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు పెంచడం విద్యార్థులకు మేలు చేయకపోగా విశ్రాంతి లేకుండా విద్యాప్రగతి కుంటుపడుతుందన్నారు. గతంలో ఉదయం 9.45 నుంచి సాయంత్రం 4.45గంటల వరకుపనిగంటలు ఉండేవని అప్పుడు విద్యార్థులు ఎన్నో విజయాలు సాధించారన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారికి సాయంత్రం 5గంటలు దాటితే సరైన రవాణా సదుపాయాలు ఉండవన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంఈవో బాలయ్య

శ్రీకాళహస్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. వారోత్సవాల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం పోటీల్లో విజేతలకు ఎంఈవో బాలయ్య బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. గ్రంథాలయ అధికారి లావణ్య, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడులో...

గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తొట్టంబేడు ఎంపీడీవో సురేంద్రనాథ్ అన్నారు. ఇక్కడి గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. గ్రంథాలయ అధికారి హరికృష్ణ, వార్డెన్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఉత్తుత్తి సర్వేలొద్దు

- ఆర్డీవో ఆధ్వర్యంలో నిర్వహించాలి
- దళిత రైతులు



కళత్తూరు బ్లాక్ నెం4.లో దళితుల భూముల్లో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కేవీబీపురం, నవంబరు 20: మండలంలో కళత్తూరు బ్లాక్ నెం.4లో భూములను గత రెండు రోజులుగా రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. అయితే ఇందుకు సంబంధించి బ్లాక్ నెం.4లో రైతులు సాగు చేసుకుంటున్న భూములను సర్వే చేయకుండా పట్టాలు ఇవ్వని పొరంబోకును సర్వే చేస్తున్నారని రైతులు అంటున్నారు. ముందుగా రైతుల సాగులో ఉన్న భూములను సర్వే చేసి హద్దులు చూపితే ఉపయోగంగా ఉంటుందన్నారు. రెవెన్యూ, అటవీశాఖ అధికారులు వారికి అనుకూలంగా ఉన్న స్కెచ్‌ను తెచ్చి సర్వే చేస్తున్నారని వారు వాపోయారు. కావునా ఆర్డీవోతో కానీ, జాయింట్ కలెక్టర్‌తో సర్వే నిర్వహించాలని దళిత రైతులు కోరుతున్నారు. కాగా ఈ భూముల కోసమే ఇటీవల దళిత రైతులు రెండుసార్లు సమీపంలో సెల్ టవర్ ఎక్కిన విషయం విదితమే.

ఆధార్ అప్‌డేట్ కష్టాలు



ఆధార్ సిబ్బంది కోసం వేచి ఉన్న ప్రజలు

రేణిగుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సామాన్య ప్రజలకు ఆధార్ కష్టాలు తప్పడం లేదు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న సచివాలయం-4లో ఆధార్ అప్‌డేట్ చేసే కార్యాలయంలో సిబ్బంది లేకపోవడంతో ఉదయం నంచి సాయంత్రం వరకు పిల్లల తల్లిదండ్రులు పలు దఫాలు వచ్చి వెనక్కు వెళ్లారు. అయితే ఆధార్ అప్‌డేట్ చేసే ఉద్యోగి ఐదు రోజులు సెలవు పెట్టడంతో మూసివేసినట్టు తెలియకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఇక బీఎస్ఎన్ఎల్, పోస్టాఫీసు ఆధార్ కేంద్రాలు పనిచేయడం లేదని స్థానిక ప్రజలు తెలుపుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో విష్ణుచిరంజీవిని వివరణ కోగా రెండు రోజుల పాటు పాఠశాల విద్యార్థులకు పరీక్షలు ఉండటంతో జడ్పీ బాలుర హైస్కూల్‌లో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడి ఆధార్ కేంద్రాల పరికరాలను అక్కడ ఉపయోగించడంతో అప్‌డేట్ చేయలేకపోయామన్నారు. ఈనెల 22న శుక్రవారం నుంచి యథాతథంగా సచివాలయం -4లో ఆధార్ అప్‌డేట్ చేస్తామని తెలిపారు.

కల్కి భూములను పేదలకు పంచాలి

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాబా వేషంలో కల్కి ఆక్రమించుకున్న భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని హేతువాద సంఘం అధ్యక్షుడు ఎన్.వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వరదయ్యపాళెం సమీపంలో నిర్మించిన కల్కి భవనాలను తొలగించాలని ఇప్పటికే కోర్టులు ఆదేశాలు జారీ చేశాయన్నారు. అయితే జిల్లాలో కొందరు అధికారులు వారితో కుమ్మక్కై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. బీఎన్ కండ్రిగ మండలంలో 21 ఎకరాల అటవీ భూములను ప్రభుత్వ స్వాధీనం చేయకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. భూములు పోగొట్టుకున్న బాధితులకు వాటిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కె.మునిచంద్రశేఖర్, రాజేశ్వరి, వరలక్ష్మి, అనసూయ పాల్గొన్నారు.

రేణిగుంట తహసీల్దారుగా సురేష్‌బాబు బాధ్యతల స్వీకరణ

రేణిగుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రేణిగుంట తహసీల్దారుగా మళ్లీ సురేష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పుత్తూరు పెట్రోల్‌బంకు మంజూరు విషయంలో తిరుపతి ఆర్డీవోతో పాటు సస్పెండయ్యారు. ఈ సస్పెన్షన్‌పై ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈక్రమంలో సీసీఎల్ఏ ఆదేశాలతో తిరిగి తహసీల్దారుగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

కేటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి







పదవమైలు దగ్గర గుంతలు - ఆలత్తూరు క్రాస్ దగ్గర కోసుకుపోయిన రోడ్డు - బీఎన్‌కండ్రిగ దగ్గర గుంతకు తోలిన మట్టి

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డులోని గుంతలకు మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కేటీ రోడ్డులోని పదవమైలు, విజయగోపాలపురం, అరిగిలకండ్రిగ, పద్మావతిపురం, బీఎన్‌కండ్రిగ, ఆలత్తూరు క్రాస్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై గుంతలు ఏర్పడటంతో ప్రయాణానికి తీవ్ర అంతరాయం కలుగతోంది. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతల కారణంగా వాహనాలు దెబ్బతినడమే కాక ప్రయాణం కూడా ఇబ్బందిగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. పదవమైలు దగ్గర అయితే రోడ్డు వర్షానికి కోసుకుపోవడంతో పాటూ పెద్ద గుంత ఏర్పడటంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. బీఎన్‌కండ్రిగ దాబా దగ్గర రోడ్డు పక్కన పైపు లైను వేసిన గుంతలకు మట్టితోలారు. వర్షాలకు మట్టి కొట్టుకుపోవడంతో తిరిగి గుంతలు ఏర్పడ్డాయి. సంబంధిత అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

కావమ్మ ఆలయంలో చోరీ



దుండగులు ధ్వంసం చేసిన హుండీ

కేవీబీపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మఠంలో కొలువై ఉన్న కావమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. బుధవారం ఉదయం 5 గంటల సమయంలో ఆలయానికి వచ్చిన పూజారి గేట్లు పగులగొట్టి హుండీ చోరీ అయినట్లు గుర్తించారు. అమ్మవారి మెడలో 8 సవర్ల గొలుసు, బొట్టు, వెండికిరీటం, వెండి ముఖాన్ని ఎత్తుకెళ్లినట్టు గ్రామస్తులకు తెలిపాడు. వారు పరిసరాలను పరిశీలించగా కొద్ది దూరంలో అమ్మవారి హుండీని ధ్వంసం చేసి అందులోని నగదును అపహరించినట్లు గుర్తించారు. వెంటనే కేవీబీపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బాలల హక్కుల వారోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న కేవీ రమణ

శ్రీకాళహస్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ కేవీ రమణ మాట్లాడుతూ నవంబరు 14 జాతీయ బాలల దినోత్సవం మొదలుకుని నవంబరు 20 అంతర్జాతీయ బాలల దినోత్సవం వరకు వారం రోజుల పాటు బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాలను నిర్వహించామన్నారు. భారత రాజ్యాంగం బాలలకు కల్పించిన హక్కులు, లైంగికదాడులు, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం వారికి వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దామోదర్‌నాయుడు, ప్రగతి సిబ్బంది ప్రభాకర్, జయలక్ష్మి, రామచంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హరిత, మంజుల, దళిత నాయకుడు చందమామల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బాలికల వసతిగృహంలో మరో సమస్య పరిష్కారం



కూలిన ప్రహరీకి మరమ్మతులు చేపట్టిన దృశ్యం

శ్రీకాళహస్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన బాలికల వసతి గృహంలో మరో సమస్యను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత పరిష్కరించారు. గతంలో ఈ వసతి గృహాన్ని తనిఖీ చేసినప్పుడు విద్యార్థులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమె గతంలో విద్యుత్ దీపాలను అందజేశారు. అదే విధంగా వసతిగృహం ప్రహరీ ఓ ప్రాంతంలో కూలింది. దీంతో ఆకతాయిలు, మందుబాబులు వసతిగృహంలోకి ప్రవేశిస్తున్నారని విద్యార్థినులు వినుత దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆమె బుధవారం తన సొంత నిధులతో గోడను సిమెంట్ రాళ్లతో మూయించి వేశారు. సమస్య పరిష్కారమవడంతో ఆమెకు విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా హాస్టల్‌లోని సమస్యలను ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు.

ఆగమోక్తంగా ఆకాశదీపం



శ్రీకాళహస్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని బుధవారం ఆకాశదీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. ఊంజల్‌మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులతో పీఈటీలు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈవో రవీంద్రనాథ్, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర నాయుడు కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి రగ్బీ అండర్ - 17లో పాల్గొనే ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలిక జట్టు శిక్షణ కార్యక్ర మాన్ని బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి రగ్బీలో పాల్గొనే బాలికల జట్టుకు శిక్షణ ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. మూడు రోజులు పాటు జట్టుకు పీడీలు, పీఈటీలు శిక్షణ ఇస్తారని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, పీడీలు కిషోర్, మస్తాన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

పిచ్చాటూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనగిరి సచివాలయాన్ని ఎంపీడీవో మహ్మద్‌రఫి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్టి సహా పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాబిన్ బాబు, విజయకుమార్, సురేష్ పాల్గొన్నారు.

మురుగుతున్న రూ.33లక్షల జడ్పీ నిధులు

రేణిగుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలానికి జడ్పీ ఫండ్ కింద రూ.33లక్షలు రెండు నెలలుగా వినియోగించు కోక పోవడంతో మురుగుతోంది. నిధులు విడుదలైనప్పటికీ ఇప్పటి వరకు మండలంలో అభివృద్ధి పనులకు ఉపయోగించలేదు. దీనికి టీడీపీ వర్గపోరే కారణం అని తెలుస్తోంది. ఈ నిధులతో ఇప్పటి వరకు పనులు చేపట్టలేదని మండలంలో విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వారం రోజులు గడిస్తే ఈ నిధులు వెనక్కు వెళ్లే పరిస్థితి ఉంది.

కొత్త వంగడాల సాగుతో అధిక దిగుబడులు

పిచ్చాటూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరిశోధన స్థానాల నుంచి విడుదలైన నూతన రకాల వంగడాలను రైతులు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండలంలోని అడవి కొడియంబేడు, కారూరుల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వరికి సోకిన ఆకు ముడత, కాండం కుళ్లు తెగులు నివారణకు ఇండెక్స్ కార్బ్ 200 ఎంఎల్, అసిపేట్ 300 గ్రాములు , నేటివో 300 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సలహా ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సంజీవరెడ్డి, శాస్త్రవేత్తలు దివ్య, రాము కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

తూర్పు మండలాల అభివృద్ధికి కృషి

పిచ్చాటూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న తూర్పు మండలాల అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని తిరుపతి ఎంపీ గురుమూర్తి తెలిపారు. బుధవారం మండలంలోని ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన వైసీపీ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు మండలాల్లో జాతీయ రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారైందని తెలిపారు. అరణియార్ ఆధునికీకరణకు జైకా నిధులు, తుడా ఆధ్వర్యంలో పర్యాటక కేంద్రం అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. సత్యవేడు వైసీపీ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్, కె.వి.భాస్కర్‌నాయుడు, కె.టి.హరిశ్చంద్రారెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాస రచన పోటీలో విద్యార్థులు

ఏర్పేడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మాతృభాషపై అభిమానంతో పాటు పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచే ఉద్దేశంతో ప్రజా కళావేదిక, పూర్వ విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సుమారు 15మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు తలా రూ.516, రూ.316, రూ.216తో పాటు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీత, తెలుగు ఉపాధ్యాయులు, ప్రజాకళా వేదిక వ్యవస్థాపక చైర్మన్ అరవ జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

అమరా ఆస్పత్రిలో అత్యాధునిక రక్త నిల్వ కేంద్రం

- ప్రారంభించిన ఎండీ డాక్టర్ రమాదేవి



నూతన బ్లడ్‌బ్యాంకు ప్రారంభం సందర్భంగా రక్తదానం చేస్తున్న రమాదేవి

రేణిగుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని అమరా ఆస్పత్రిలో అత్యాధునిక రక్త నిల్వ కేంద్రాన్ని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి ప్రారంభించారు. నూతన బ్లడ్‌బ్యాంకు ప్రారంభం సందర్భంగా అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులతో కలిసి రక్తదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కొత్త బ్లడ్ బ్యాంక్‌లో అధునాతన సాంకేతికత, రక్తసేకరణ, పరీక్ష, ప్రాసెసింగ్, నిల్వ వసతులున్నాయన్నారు. హోల్ బ్లడ్, ప్యాక్డ్ సెల్స్, సెలైన్ వాష్డ్ ఆర్బీసీ, ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా, క్రియో ప్రిసిపిటేట్, ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా, ప్లేట్‌లెట్ కాన్సన్‌ట్రేషన్, సింగిల్ వంటివి డోనర్ ప్లేట్లెట్స్, సింగిల్ ప్లాస్మా రోగులకు అందుబాటులో ఉంటాయన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకే కాకుండా ఇతర రక్త సంబంధిత ఉత్పత్తులు కావాలనుకునే వారందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. అయితే ప్రస్తుతం రక్త సంబంధిత ఉత్పత్తులు అవసరానికి అనుగుణంగా అందుబాటులో లేవని దాతలు పెద్దఎత్తున ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ గౌరినేని, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

24న జాతీయ కవి సమ్మేళనం

తిరుపతి (లీలామహల్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారతీయ రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో పదకవితా పితామహుడు అన్నమయ్యపై తిరుపతిలో ఈ నెల 24వ తేదీన జాతీయ కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు సమాఖ్య తిరుపతి జిల్లా అధ్యక్షుడు పాలకూరు కన్నయ్య తెలిపారు. యూత్ హాస్టల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమంలో చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన సాహితీవేత్తలు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.